# రాకడ ప్రార్థనలు - స్తుతులు

"ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను,
ఈ గ్రంథములోని ప్రవచన వాక్యములను
గైకొనువాడు ధన్యుడు" - ప్రకటన 22:7


-: గ్రంథకర్త :-

**ఫాదర్. యం. దేవదాసు అయ్యగారు**



కాకినాడ,
నవంబరు 2010

**వెల: రూ. 20/-లు**


# ప్రవేశము

రెండవ రాకడ ప్రియులకు మరనాత! ప్రేమవందనములు.

ఇదొక మర్మము. రెప్పపాటులో మార్పుపొందుదుము. క్షయతనుండి అక్షయ స్థితికి, మరణము లేకనే మహిమలోనికి మారిపోవుట లేక ఎగిరి పోవుట వినుచున్నంతలో, అనుకొన్నంత సుళువుగాదు, తిండి, మత్తు, ఐహిక విచారములు, శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము, శరీరేచ్ఛ, లోకమర్యాదలు, అనాచారములు, దురాచారములు, అవిశ్వాసులతో పొత్తు, స్వార్థ ప్రియత్వం, అపరిశుద్ధ విధానములు, సోమరితనము, మందస్థితి, వ్యర్థ సంభాషణలు ఇలా ఎన్నెన్నో సుళువుగా ఈడ్చుకొనిపోవు దుస్థితులన్నింటిని దాటి మహిమ రాకడ మేఘమెక్కుటకు, ఆపై ఏడేండ్ల పెండ్లి విందు, నూతన యెరూషలేము సహవాస భాగ్యము నొందుటకు ఆత్మానుసారమైన చిన్న చిన్న ఉపమానము లతో అమూల్య భావనాత్మక సందేశముల మహిమ ముత్యాలహారమే ఈ రాకడ ప్రార్థనలు-స్తుతులు. సహజకవియైన దైవజనుడు దేవదాసు అయ్యగారు నిత్యసన్నిధానవర్తులు. ప్రభువు చిత్తము నెరిగినవారు గనుక ఆయన (ప్రభువు) యెదుట నిలువబడుటకు కావలసిన యోగ్యతాసిద్ధబాటుకు చక్కని బాట - ఈ పుస్తక ఉద్దేశ్యము.

7-11-2010
కాకినాడ

పెండ్లి కుమారుడిగా త్వరగా వచ్చుచున్న
యేసుక్రీస్తునందలి **బి. ఇమ్మానుయేలు**
బైబిలుమిషను మినిస్ట్రీస్, కాకినాడ.

# రాకడ ప్రార్థనలు - స్తుతులు

ఒక అబ్బాయి దూరదేశములోనుండి నేను వచ్చుచున్నానని ఉత్తరము వ్రాసెను. ఆ అబ్బాయి ఇంటివారు ఆ ఉత్తరము చూచుకొని ఆనందించి ఆ అబ్బాయి కొరకు ఎదురు చూతురుకదా! అట్లే యేసు ప్రభువు వచ్చెదనని చెప్పిరి గదా! వచ్చెదనని చెప్పిన అబ్బాయి రాకుండునా? ఎప్పుడో ఒకప్పుడు వచ్చునుగదా! ఆ అబ్బాయి ఇంటి వారు అతనికొరకు ఎదురుచూచినట్లుగా మనమును యేసు ప్రభువు యొక్క రాకకై ఎదురుచూచిన యెడల ఆయన వచ్చినప్పుడు ఆయనతో ఆగమనములో ఎగిరి వెళ్ళగలము. అట్లు ఎదురు చూడగల మనసు అనుగ్రహింతువని నమ్మి ఓ ప్రభువా! నిన్ను వందించు చున్నాము.

2. ఆ అబ్బాయి ఫలాని ఓడకు వచ్చుచున్నానని వ్రాసెను. ఆ యింటివారు కాకినాడకు ఓడలో వచ్చుచున్న అబ్బాయిని కలిసికొనుటకు వెళ్ళిరి. ఓడవచ్చినది గాని ఆ అబ్బాయి ఎందుకో ఆ ఓడమీద రాలేదు. ఆ ఇంటివారు ఆ ఓడను చూచి అబ్బాయి రానందున తిరిగి ఇంటికి వెళ్ళిపోయిరి. అయితే ఆ అబ్బాయి రెండవ ఓడమీద దిగినాడు. తన ఇంటివారెవరును తనను కలసికొనుటకు రానందున తిరిగి వెనుకకు వెళ్ళిపోయినాడు. అలాగే యేసు ప్రభువు రాకడ ఆలస్యమైనందున అనేకులు వెనుకకు వెళ్ళిపోవుదురు ఆ అబ్బాయి రెండవ ఓడకు వచ్చినట్లుగా ప్రభువు కూడ వచ్చి సిద్ధపడియున్న వారిని తనతో కూడ పైకి తీసికొని వెళ్ళును గనుక ఆయన రాకడ ఆలస్యమైనందున ఆగిపోక ఆయనతో వెళ్ళుటకు సిద్ధముచేయుమని వేడుకొనవలెను, ఓ ప్రభువా నీ రాకడ ఆలస్యమైనను మేము వెనుకకు తిరిగి పోవువారిలో చేరకుండ ఎల్లప్పుడు సిద్ధపడియుండు కృప దయచేయుదువని నమ్ముచు నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

3. ఒక యవ్వనస్తుడు తన భార్యకు నేను ఫలాని బండికి వచ్చుచున్నాను ఆ బండికి నీవు వచ్చి నన్ను కలసికొనవలెను. లేనియెడల నేను ఇంటికి



రాను అని వ్రాసెను. అతని భార్య వంటలు మొదలగునవన్నియు తయారు చేసికొని స్టేషన్‌కు వెళ్ళెను ఆదినము రెండుగంటలు ఆలస్యమైనందున ఆమె ఇంటికి వెళ్ళెను. తర్వాత బండి వచ్చినది. అతడు దిగి ఆమెకొరకు అంతాచూచి ఆమె కనబడనందున అతడు విచారించి ఆ బండికే వేరొక చోటికి వెళ్ళెను. అలాగే మనమును ఆయన రాకకు ఎదురుచూచి తీరా వచ్చుసరికి వెనుకకు వెళ్ళిపోయిన రాకడలో వెళ్ళలేము. ఆలస్యమైనను ఆయన వచ్చువరకు కనిపెట్టి చూచుచు సిద్ధపడవలెను. అప్పుడు రాకడలో వెళ్ళగలము ఓ ప్రభువా మేము కనిపెట్టుచు సిద్ధపడుచునుండగల కృప దయచేయుదువని నీకు స్తుతులర్పించుచున్నాము.

4. ఒకరు ప్రయాణమునకువెళ్ళవలెనని గోదావరి స్టేషనుకు వచ్చేసరికి బండి దాటిపోయినది అతడు వెంటనే తెలివితేటలు గలిగి రాజమండ్రి స్టేషనులో బండి అరగంట ఆగునని, వెంటనే రిక్షా కట్టించుకొని గబగబ పరుగెత్తించి స్టేషను చేరెను. వెంటనే టిక్కెట్ కొని బండిలో ప్రవేశించినాడు. అలాగే మనమును తెలివితేటలు ఉపయోగించుకొని గబగబ పనులు చేసికొని రాకడకు సిద్ధపడవలెను. ఒకవేళ వెనుకబడినను ఏదోవిధముగా అందుకొన వలెను. ఆ ప్రయాణీకునివలె తెలివితేటలు ఉపయోగించి రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

5. ఒకడు మగ్గముపై దుప్పటి నేయుచు ఈ కొంచెమే ఉన్నది గదా అని త్వరగా నేసి వెంటనే వస్తాను మీరు వెళ్ళి బండికి టిక్కెట్టు తీసికొనండని చెప్పెను. అతడు ఆ దుప్పటిని త్వరత్వరగా నేసి ఎగబెట్టేసరికి ఆలస్యమైనది. బండికి అందుకొనవచ్చుననుకొన్నాడు గాని పనులవలన ఆలస్యమైనందున ఇతడు వెళ్ళేసరికి ఆ బండి వెళ్ళిపోయెను. అలాగే ఆయా పనులు పెట్టుకొని బండిని అతడు దాటిపోజేసినట్లు మనము నానాపనులు పెట్టుకొని రాకడలో వెళ్ళలేక వెనుకబడిపోదుము. ఓ ప్రభువా! నీ రాకడ విషయములో మేమట్టి అశ్రద్ధ చూప కుండ మమ్మును సిద్ధపర్చుదువని నమ్మి నీకు ప్రణుతులు చెల్లించుచున్నాము.

6. కొందరు అనేకమైన పనులు కల్పించుకొని పనులలోనే పడిపోయి ఈదులాడుకొనుచు ప్రభువు యొక్క రాకడను మరచిపోవుదురు. ఇంతలో ఆయన వచ్చి ఎదురుచూచుచు, సిద్ధపడినవారిని తీసికొనిపోవును పనులు ముగించుకొని తేరి చూచినప్పటికి రాకడ వచ్చి వెళ్ళిపోవడము కూడ జరుగును. అలాగే సమయమంత పనులు పనులు అని పనిపాటలతోనే కాలము గడుపువారు రాకడలో ప్రభువును కలసికొనలేరు. మేము లోకపు పనులలో మునిగి నీ రాకడను నిర్లక్ష్యము చేయకుండ ఉండే కృప దయచేయుదువని నమ్మి నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

7. ప్రతిదినము రాకడ ప్రార్ధన, రాకడ వాక్యములు రాకడ తలంపు కలిగి యుండకపోయిన రాకడలో ఎత్తబడలేరు. గనుక నిత్యమును, ఏపనిచేయుచున్నను రాకడ ధ్యానము. రాకడ తలంపు కలిగి యుండిన రాకడలో ఎత్తబడగలరు. నీ రాకడ తలంపు నిత్యము మాలో నుంచుదువని నమ్ముచున్నాము నీకు నిత్య స్తోత్రములు.

8. ఒకరైతు కళ్ళమునందున్న ధాన్యములోని రాళ్ళను, ఏరిపారవేసిన రీతిని, జల్లెడలోవేసి జల్లించిన రీతిని చేటలోవేసి చెరిగివేసి శుభ్రముగానున్న గట్టిగింజలను జాగ్రత్తచేసెను. అలాగే మనలోనున్న చెడు ఆలోచనలు, చెడు పనులు మొదలగు రాళ్ళన్నిటిని చెత్త, పొల్లువంటి పాపములను జల్లించి చెరిగివేసికొనవలెను. అప్పుడు మనము గట్టిగింజలుగా ఏర్పడి రాకడలో ఎత్తబడగలము. ఓ ప్రభువా! ఇట్లు మమ్మును మేము శుభ్రము చేసికొనగల సహాయము దయచేయుదువు గనుక నీకు నిత్యమంగళ స్తోత్రములు.

9. ఒక స్త్రీకి చంటిబిడ్డ కలదు. ఆ బిడ్డ ఆడుకొనుచు బురద చేసికొనగా, బిడ్డను ఆమెనీళ్ళతో కడిగి శుద్ధిచేసినది అయితే ఆబిడ్డ మరల ఆడి మరల బురద చేసికొనగా తిరిగి తల్లి కడిగివేసినది. అనేకమార్లు ఆ బిడ్డ బురద చేసికొనగ అలాగే కడిగి శుద్ధిచేసిన రీతిగా మనమును మన మనస్సులోనికి చెడ్డతలంపు వచ్చినప్పుడు వెంటనే యేసురక్తముతో ఆ పాపము శుద్ధిచేసు



కొను అలవాటు కలిగియుండవలెను. వెంటనే శుద్ధిచేసికొనపోయిన అలస్యమైపోవును గనుక పాపములో పడగానే ప్రభువు రక్తముతో పవిత్రము చేసికొనవలెను. ఎన్ని మారులైనను యేసు రక్తమే జయము అనునది అలవాటుచేసికొనవలెను. ఓ ప్రభువా మేమట్లు శుద్ధి చేసికొని నీ రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి వందించుచున్నాము.

10. దూర ప్రయాణముచేయువారు ఉదయం కాఫీ, మధ్యాహ్నము, సాయంకాలము భోజనము చేసిన, 4గం॥లకు మరల కాఫీ తీసికొనినగాని ప్రయాణము చేయలేరు. అలాగే మనము ఆకలి వేసినప్పుడెల్ల ప్రభువు యొక్క శరీర రక్తములు అను ఆహారమును తీసికొని అనుభవింపక పోయిన ప్రయాణము చేయలేము. గనుక సంస్కార భోజనము పుచ్చుకొనిన రాకడలో వెళ్ళగలము, ఓ ప్రభువా! నీవు ఏర్పాటుచేసిన సంస్కారపు విందును అనుభవంచి బలముపొంది నీ రాకడలో పాల్గొను కృప దయచేయుదువని నమ్మి నీకు స్తుతులర్పించుచున్నాము.

11. క్రైస్తవ సంఘములోని కొందరు రాకడ సమీపముగా ఉందని ఎదురుచూచుచున్నారు. కొద్దిమంది మాత్రమే నమ్ముచున్నారు కొందరు నమ్ముటలేదు. ఓ ప్రభువా ఒకవేళ నమ్మనివారు నమ్మిన యెడల వారిని రాకడకు సిద్ధపరచుము నమ్మినవారు నమ్మిన ఇంకను సిద్ధపర్చుము నమ్మని వారికి నమ్మకము పుట్టించుము నమ్మని వారిని, నమ్మలేనివారిని, నమ్మిన వారిని, రాకడకు సిద్ధపర్చుము. ఇట్లు నీ సంఘమును రాకడకు ఆయత్తము చేయుదువని విశ్వసించి స్తుతులర్పించుచున్నాము.

12. అన్యులలో ప్రభువును నమ్మినవారున్నారు నమ్మనివారు కూడ ఉన్నారు. వారు సిద్ధపడుట ఎట్లు? ఎవరో ఒకరు వెళ్ళి వారికి రాకడను గురించి బోధించవలెను. లేనియెడల వారికి నమ్మకము కలుగదు వారు సిద్ధపడిన సరే. సిద్ధపడకపోయిన వారిని సిద్ధపర్చుమని ప్రార్ధించుచున్నాము.

13. గురుతులు అయన తర్వాత రాకడ జరుగునని క్రైస్తవులు చెప్పుచున్నారు

అయితే ఎప్పుడును ఒకేలాగున్నది. ఈ గురుతులు ఎప్పుడును ఒకేరీతిగానున్నవి. ఈ గురుతులన్ని ఇదివరకే వున్నవి. క్రొత్తవిఏవియులేవు అని ఆక్షేపణచేయు వారి గురించి ప్రార్థించవలెను. గనుక భక్తులైనవారు గురుతులు ఏవేవి ఏ సంవత్సరమున ఏవేవి ఏ దేశములలో జరిగినవో ఇంకా క్రొత్త గురుతులు ఏమి జరుగునో, బైబిలులో లేని ఎక్స్ట్రా గుర్తులు వ్రాయునట్లు ప్రార్థింపవలెను. ఓ ప్రభువా! అట్టి భక్తులను లేపి రాకడ గుర్తులను వ్రాసి లోకమునకు చూపించు కృప దయచేయుదువని నమ్మి నీకు కృతజ్ఞతార్పణలు చెల్లించుచున్నాము.

14. లోకములో కొందరు సువార్తపత్రికలు అచ్చువేసి అనేకులకు పంపుచున్నారు. వారు కేవలము దేవునివలన ప్రేరేపింపబడి వ్రాసి అనేకులకు పంపుచున్నారు అట్టి పత్రికలలో కొన్ని 1) నవీనకాల విషయములు తెలియచేయునవి 2) మరికొన్ని రెండవరాకడ విషయములు తెలియజేసెడివి. 3) కొన్ని ప్రవచనకాల విషయములు తెలియజేసెడివి. పై మూడురకముల పత్రికలు ఊరకనే అనేకులకు పంపుచున్నారు. వీటిన్నిటిని ప్రభువు దీవించుచున్నారు గనుక ఆయనకు మంగళ స్తోత్రార్పణలు.

15. క్రీస్తుమతము పుట్టి 20 శతాబ్దములు అయినది. ఈ 20 శతాబ్దములలో ఏయే సంగతులు జరిగినవి ఎందరు క్రైస్తవులయినది ఎన్ని రాకడగుర్తులు జరిగినవి. ఏయే గురుతులు ఏయే కాలములలో జరిగినవి. ఆ గురుతులు జరిగినపుడు వాటి పని ఏమిటయినది ఆ గురుతులవలన ప్రభువునకు ఏమి మహిమ కలిగినది. లోకములో జరుగుచున్న విషయములు ఒక పుస్తకములో అయ్యగారు వ్రాసియుంచిరి. ఆ పుస్తకమును అయ్యగారు జాగ్రత్తగా దాచిఉంచగా ఎవరో ఒకరు మరల పంపించెదనని తీసికొని వెళ్ళిరని తెలిసి వ్రాయగా పంపించెదనన్నారు గాని ఇంతవరకు పంపలేదు ఆ పుస్తకము మరల దొరికిన రాకడ గుర్తులన్నియు అందులో గలవు. ఎంత పనియైన చేయవచ్చును. అతి త్వరలో దొరుకునట్లు ప్రార్థన చేయండి. ఆ పుస్తకము దొరికిన అప్పుడు అన్యులు క్రైస్తవులు ఏలాగున్నది, యేమేమి పొందినది



తెలియగలదు. ప్రార్థన: దయగల తండ్రీ నీ రాకడకు కొందరు సిద్ధపడుచున్నారు. కొందరు సిద్దపడుటలేదు. కొందరు సిద్దపడవలెనని తలంచుచున్నారు. కొందరు సిద్దపడవలెనని ప్రయత్నము చేయుచున్నారు. గాని సిద్దపడలేక పోవుచున్నారు. గనుక మమ్ములనందరిని నీరాకడకు సిద్దపరచి నీతో మేమందరము బయలుదేరు భాగ్యము అనుగ్రహించి సిద్ధపరచి స్థిరపచుము.

16. సౌలురాజు తైలాభిషేకమును, ఆత్మను పొందినను, యుద్ధములలో జయము పొందినను చివరకు తప్పిపోయెను. అలాగే కొందరు క్రైస్తవులు చివరివరకు అనగా రాకడ వరకు బాగుండి రాకడ ఈవేళో రేపో అనగా తప్పిపోయి నిరాశపడుదురు మేము అట్టివారము కాకుండా కాపాడుదువని నిన్ను స్తోత్రించుచున్నాము.

17. ఎప్పుడు రక్షణను గురించిగాని, రాకడను గురించిగాని విననివారు ఆఖరు దినమున విని తయారు కావచ్చును. ఏలాగనగా రైలుబండి ఆలస్యముగా బయలుదేరిన కొందరు పరుగెత్తికొని వచ్చి రైలుకదిలే సమయములో ఎక్కుదురుగదా! సిలువ మ్రానుమీద దొంగ ఆక్షణములో మారుమనస్సు పొందెనుకదా! అట్లు మేమును రాకడలో పాల్గొనుకృప దయచేతువని నమ్మి స్తుతించుచున్నాము.

18. తీరా మరణ సమయమున కొందరుమారుమనస్సు పొంది బహుకొద్దిమంది రాకడకు సిద్దపడుదురు. అది నీ కృప అట్టి కృప మాకును దయచేయుము నీకు ప్రణుతులు.

19. కొందరు మంచి పనిమీదవుండి ముగించనప్పటికీ రాకడ వచ్చును, భోజనము సగము తినుచున్నప్పుడు రాకడ వచ్చిన తయారుగానున్న వారు వెళ్లిపోవుదురు మేమేస్థితిలో ఆసమయమునకు ఉన్నను రాకడలో ఎత్తబడగల కృప దయచేయుదువు గనుక నీకు మా నమస్కారములు.

20. కొందరు నిద్రలో ఉండగానే రాకడకు ఎత్తబడుదురు. గనుక నీకు మా హృదయ వందనములు.

21. ఒకరు మరియొక గ్రామములో ఎవరో చనిపోయినారని విని ఏడ్చుచుండగా రాకడకు ఎత్తబడుదురు గనుక నీకు స్తుతులు.

22. ఒకరు స్వస్థానములకు వెళ్ళుటకు, అనగా కుమార్తె తండ్రి ఇంటికి వెళ్ళుటకు ఆశించును. అలాగే ప్రభువుయొక్క రాకడకొరకు ఎదురుచూచు చున్నారు అలాగే పెండ్లికుమార్తె పెండ్లికుమారుని రాకకు ఎదురుచూచుచున్నది. అట్టి సంఘము రాకడలోనికి వెళ్ళును ఎదురు చూడనివారు రాకడలోనికి వెళ్ళరు. మేము ఎదురుచూచు వారిగానుండు వీలు కలిగింతువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

23. ఒక గ్రామములో చాలా కలహములుండును. ఒకరు జ్వరముతో నున్న తన కుమార్తెను చూచుటకు వచ్చి కలహములయొక్క భయంకర స్థితిని గూర్చి వినెను. ఈ కలహములలో తనకుమార్తెను అక్కడ ఉండుట అపాయమని తలంచి తన ఇంటికి తీసికొనిపోయెను అలాగుననే ఈలోకము, గత్తర లోకము, పాపలోకము, పాపఫలితములున్న అవస్థలలోకము, కరువుల లోకము, వ్యాధుల లోకము, విషపురుగుల లోకము, నిరీక్షణలేని లోకము, మరణలోకము దయ్యముల లోకము, దయ్యములకు లోబడిన మనుష్యులున్న లోకము గనుక మోక్షమందిరమునకు తీసకొని వెళ్ళుటకు శీఘ్రముగా వచ్చును ఇదే రెండవరాకడ. తండ్రి కుమార్తెను తీసికొని వెళ్ళునప్పుడు రాను అని చెప్పదుగదా! అలాగే మనముకూడ మేఘములోనికి రాము అని చెప్పకూడదు. ప్రభువా! తండ్రీ! సిద్ధముగా నున్నాను అని చెప్పవలెను. అట్లు చెప్పగల కృపదయచేయుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

24. సముద్రము యొక్క కెరటములు రేయింబగళ్ళు గాలివలన శబ్దము చేయుచున్నవి. సముద్ర తరంగములను రేపుచున్న గాలివలె దైవాత్మ భక్తుల యొక్క హృదయములను రేయింబగళ్ళు కదిలించుచున్నది. అప్పుడు వారు రక్షణ పొంది అందులకు స్తుతింతురు మరియు రాకడ వచ్చుచున్నదని స్తుతించుచు సంతోషింతురు. ఓ ప్రభువా! అట్టి రెండు విధములైన స్తుతులు మాకు నేర్పుము.



25.దేవా! నీవు ఏనాడు సూర్యచంద్ర నక్షత్రములను సృజించినావో ఆ దినము మొదలు నేటివరకు అవి ఆకాశమండలములో నుండి ప్రకాశించు చున్నవి. జ్యోతులు తమకు నియమింపబడిన మార్గమున ప్రయాణము చేయుచునే ఉన్నవి. అలాగుననే మేముకూడా మా ఆనంద దీపములతో మా మార్గములలో నడుచుచు స్థిరముగానుండునట్లు దీవించి నీరాకడకు సిద్ధపరచుము. నీవు దయచేసిన రక్షణ రాకడ భాగ్యము గురించి నిన్ను మహిమపరచు కృప దయచేయుము.

26. దేవా నీవు కలుగజేసి మాలోపెట్టిన ఆత్మ ఎల్లప్పుడు నిన్నే తలంచునట్లు చేయుము. ఆత్మవైన నీతోఏకీభవించుటకు కృప దయచేయుము మా ఆత్మతో నిన్ను స్తుతించు శక్తి దయచేయుము. మా ఆత్మ నీయొద్దకు వచ్చువరకు రక్షణను గురించియు,రాకడను గురించియు స్తుతించు ధోరణి దయచేయుదువని నమ్మి నీకు కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించుచున్నాము.

27. ప్రభువా మా వ్రాతస్తుతులు నిజమైన స్తుతులుగా నీకు ఇష్టమైన స్తుతులుగా మార్చివేయుము వ్రాత ఎప్పటికైన చెరపవచ్చునుగాని, నీ ఆత్మ సహాయముచేత వచ్చిన స్తుతి చెడిపోదు అట్టి స్తుతి మాకు దయచేయుదువని నిన్ను వందించుచున్నాము.

28. ఓ దేవా నీ రాకడ ఎంత నిశ్చయమో, ఎంత నిజమో మా స్తుతికూడా అంత నిశ్చయము నిజమైయుండుటకు కృపదయచేయుము.

29. రక్షణ ఎంత నిశ్చయమో రాకడ అంత నిశ్చయము. మేము స్తుతించు టయు, సిద్ధపడుటయు అంత నిశ్చయమైయుండునట్టి కృపదయచేయుము.

30. మేము పరలోకమునకు వచ్చినప్పుడు మా పాత శరీరము ఇక్కడ విడిచివస్తాము మా స్తుతులలోను, మా సిద్ధపడుటలోను, మా నమ్మికలోను ఉన్న కళంకములు ఇక్కడ విడిచిపెట్టు శక్తి దయచేయుము.

31. కలముతో కాగితముమీద స్తుతి ప్రార్థనలు వ్రాసిన ఎప్పటికైన చెడిపోవును. మా హృదయమనే కాగితముమీద ఆత్మవ్రాసిన స్తుతి ఎప్పటికిని

చెడిపోదు. అదిపోదు. అట్లు మా హృదయములపై వ్రాయుము.

32. యేసుదాసు అను యౌవనస్థుడు పడమటినుండి రాజమండ్రి వచ్చెను. రోడ్లమీద తిరుగుచు చిరతలు వాయించుచు, చిందులు త్రొక్కుచు ప్రజలారా! యేసుక్రీస్తు ప్రభువు రెండవసారి వచ్చుచున్నారు. ఈ సంగతి తెలిసికొనండి. ప్రార్థించండి సిద్దపడండి అని కేకలువేసి చెప్పేవాడు అందుచేత ప్రజలు పరుగుపరుగునవచ్చి గుంపుగూడి వింతగా ఆయన చెప్పు మాటలు వినేవారు అతనికి జీతము లేదు. చదువులేదు ఉదయము చెట్టుక్రింద కూర్చుని ప్రభువా ఇప్పటివరకు నీ సేవచేసివచ్చియున్నాను నాకు అన్నము పెట్టు అని ప్రార్థించువాడు అప్పుడు ఎవరో ఒకరువచ్చి సంగతి కనుగొని ఆకువేసి అన్నముపెట్టువారు. ఒకనాడు ధవళేశ్వరము వెళ్ళి బోధించినాడు. పోలీసు వారు అతనిని కొట్టులో పెట్టిరి. అక్కడ ఆయన పోలీసువారికి, ఇన్‌స్పెక్టర్ గారికి బోధచేసెను. ఇతడు దైవభక్తుడు ఇతనిని జైలులో వేయరాదని విడిచిపెట్టిరి చదువరులు రాకడబోధ ఇంకా ఎక్కువ చేయవలెను, అట్లు బోధించువారిని ఎక్కువమందిని లేపుమని ప్రార్థించండి. ఇతనికి విశ్వాసము వల్ల అన్నము దొరికినది. మరియొక సంగతి యేదనగా ఒకప్పుడితడు అడవిలో బడి వెళ్ళుచుండగా పెద్దపులి ఎదురుగా కూర్చుండెను. ఇతడు చిరతలు వాయించుచు చిందులు త్రొక్కుచు ఓ పెద్దపులి నేను నిన్ను హానిచేయ రాలేదు గనుక నీవు నాకు హాని చేయకూడదని చిరతలు వాయించి ఎగిరి దుమికెను ఆ పులి పారిపోయెను. అట్టి విశ్వాసమున్నవారు రాకడకు సిద్దపడ గలరు వారు భూతమును ఎదిరింతురు. ప్రభువా మేమట్టి విశ్వాసము గలిగి సాతాను నెదిరించు కృపదయచేయుము.

33. గవర్నరుగారు వచ్చుచున్నారనగా ఇండ్లు శుభ్రము చేసికొని, సున్నమువేసికొని, రోడ్లన్ని శుభ్రముగా చేసి సిద్ధముగా నుందురు. అలాగే రాజాధిరాజైన ప్రభువు వచ్చుచుండగా సిద్ధపడరాదా! మేము మరి ఎక్కువగా సిద్ధపడు కృప దయచేయుము.



34. రాజమండ్రిలో క్రొత్తగా రైలుబండి నడిచినప్పుడు అన్ని ప్రక్కలనుండి ప్రజలు, పొలములనుండి, ఇండ్లలోనుండి, బజారులోనుండి పరెగెత్తుకొని వచ్చువారు, అలాగే రాకడ అనగా అందరు సిద్దపడవలెను తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణములు నుండి ప్రజలు ఏలాగు రైలుబండికి వచ్చుచున్నారో అలాగే రాకడకు రావలెను.

35. క్రీస్తు ప్రభువా నీవు మానవులమైన మమ్ములను రక్షించు నిమిత్తము ప్రత్యేకముగా నియమించబడిన దివ్య పురుషుడవు గనుక నీకు అనంతకాల స్తోత్రములు.

36. యేసుప్రభువా! నీవు ఈలోకములో మనుష్య శరీరముతో జన్మించెదనని పాతనిబంధనలో వాగ్ధానములు వ్రాయబడి యున్నవి. అవి ప్రత్యేక వాగ్ధానములై యున్నవి. ఇది నీ రాకడలో ఒక రాకడయై యున్నది గనుక స్తోత్రములు

37. మా ప్రభువా! నీ జన్మము మానవులలో ప్రత్యేకమైన జన్మమై యున్నది. ఇది నీ రాకడలో ఒక రాకడయై యున్నది గనుక నీకు స్తోత్రములు.

38. మరియు నీవు భూలోకములో నడచిన జీవితము ఒక చరిత్రయై యున్నది. ఇది నీ రాకడలో ఒక రాకడయై యున్నది గనుక నీకు స్తోత్రములు.

39. ఓ ప్రభువా! నీ మరణము ఎవరికి లేని ప్రత్యేకమైన మరణమై యున్నది. ఇది నీ రాకడలో ఒక రాకడ గనుక నీకు స్తోత్రము.

40. ప్రభువా! నీ పునరుత్థానము ఎవ్వరు ఎరుగనటువంటి ప్రత్యేకమైన పునరుత్థానము ఇది నీ రాకడలో ఒక రాకడ గనుక నీకు స్తోత్రము.

41. ప్రభువా! నీ ఆరోహణము ఎవరికిని అర్ధముకాని ఆరోహణము మాత్రమేకాక, హనోకు యొక్కయు, ఏలియా యొక్కయు ఆరోహణమువంటిది మాత్రమే కాక ప్రత్యేకమైన ఆరోహణము ఇది నీ రాకడ గనుక నీకు స్తోత్రములు.

42. యేసు ప్రభువా నీ రాకడ అందరికి ఆశపుట్టించి ఎదురు చూచుటకు ఇదిగో, అదిగో అన్నట్టుండుటవలన ఇది విచిత్రమైన సంఘారోహణము.

ఇది పెండ్లి రాకడ, నీవు మేఘాసీనుడవై వచ్చే రాకడ. రాకడయందు సంఘమును ఆకర్షించే రాకడ నేడు లోకమును గలిబిలి కలిగించే రాకడయై యున్నది. గనుక నీకు వందనములు అట్టి విచిత్రమైన రాకడకు మమ్మును సిద్ధపరచుము. నీకు స్తోత్రములు.

43. భూమి పుట్టినది మొదలుకొని నేటివరకు నీభక్తులు నిన్ను పిలుచుచున్నప్పుడెల్ల వచ్చుచునే యున్నావు అవన్నియు లెక్కపెట్టిన అనేకమైన రాకడలగును అవి ఒక్కొక్కరి దగ్గరకు వచ్చిన రాకడలు గనుక నీకు స్తోత్రములు.

44. ఒక గ్రామమునకు గొప్ప ఉద్యోగులు వచ్చుచున్నారని మునసబు గారు చాటింతురు. ఆయన వచ్చే దారిలో చెత్త, అడ్డములు లేకుండా చేయుమనియు, వీధులలోని ఇండ్లకు వెల్లవేసికొమ్మని చెప్పుదురు. వీటన్నిటికి ఖర్చులు మునసబు గారు ఇవ్వరు, ప్రజలు తమంతట తామే ఆ ఖర్చు భరింతురు, అలాగే గుర్తులు యేసుప్రభువు వచ్చుచున్నాడని చాటించుచున్నవి. అయితే బోధకులు మీ హృదయములు శుద్ధిచేసికొనండి. తప్పిదములు ఒప్పుకొనండి సిద్ధపడండి. అని సలహాలు చెప్పుదురు. గాని బోధకులు మనుష్యులయొక్క హృదయములలోనికి వెళ్ళి శుభ్రము చేయరు. ఎవరి మట్టుకు వారే సిద్ధపడవలెను, ఎవరిమట్టుకు వారే ప్రార్థనలు స్తుతులు, చేసికొనవలెను యెవరి మట్టుకువారే రాకడ పాఠములు నేర్చుకొనవలెను. ఓ ప్రభువా మేము స్వయముగా సిద్ధపరచుటకు శక్తి నీసహాయము వీలు దయచేయుము నీకు స్తోత్రములు.

45. పరలోకములో నున్న పరిశుద్ధులు. దేవదూతలు వారికి రక్షణ అవసరము లేనప్పటికి రాకడ. రాకడ అని తొందరపడుచున్నారు. అయితే రక్షణకావలసిన మనము ఇంకా ఎంతో తొందర పడవలెను. లోకములో నున్నవారు నీ రాకడ ఎప్పుడు అని అడుగుచున్నారు. ఓ ప్రభువా! మా పక్షముగా నీవే వారికి జవాబు చెప్పుము.

46. ఓ ప్రభువా! మా పద్ధతి ప్రకారము లోకమునకు రక్షణ వార్త



రాకడ వార్త అందించినాము ఇప్పుడు నీ స్వంత పద్ధతి ప్రకారము రక్షణ వార్త రాకడ వార్త యెట్లు చెప్పవలెనో అట్లు లోకములోని ప్రతిమనిషికి చెప్పుము. నీ పద్ధతి మాకు తెలియదు. అట్లు లోకమునకు నీ రాకడ వార్త అందజేయుదువు గనుక నీకు స్తోత్రములు.

47. ఓ స్వతంత్రత గల మానవులారా ఒక్క నిమిషము మీ పనులు కట్టివేసి నా మాట ఆలకించండి, దేవుడును అందరిరక్షకుడును అయిన క్రీస్తు ప్రభువు మేఘము మీద వచ్చి భూమిమీదనున్న భక్తులను ప్రాణముతోనే మోక్షమునకు తీసికొని వెళ్ళును ఆ భక్తులకు మరణముండదు. ఇప్పటి నుండి ప్రార్థించి సిద్ధపడండి. ఓ ప్రభువా! ఇట్టి వార్త లోకమంతటికిని అందించుము.

48. కొన్ని యేండ్ల క్రిందట వైద్యులు కొన్ని మాత్రలు కల్పించినారు. అవి కొన్నవారు గదుల మూలలో వాటిని ఉంచగా ఎలుకలు వాటిని మ్రింగి బయటికి పోయినవి, అప్పుడు వాటి గుండెలలో భయము పుట్టి మరల ఆ గదులలోనికి రాలేదు. ఎలుకలను చంపకుండ వెళ్ళగొట్టుపద్ధతి, అలాగే రక్షణవార్త రాకడవార్తరేపు మా సన్నిధి కూటమునకు డిక్టేషన్ చెప్పుము. అది తెలుగులో, ఇంగ్లీషులో ప్రచురించి ఇంగ్లీషువార్త అయిదు ఖండములకు పంపించెదము. అప్పుడు చదువుకొనువారి యొక్క గుండెలలో గొప్ప భయము, దడ, ఆందోళన కలుగును, నమ్మిన యెడల మతి చాంచల్యము కలుగును. ఇది భయంకరము గాని రక్షణ మార్గము కలుగును. ఇది మేము నీకు విన్నవించుకొను నూతనమైన కడసరి పద్ధతి దీనివల్ల మనుష్యుల హృదయములలో భూకంపములు కలుగును. అప్పుడు అందరు కెవ్వున కేకవేసి ప్రభువా రక్షించు, రాకడకు సిద్ధపర్చు అని ప్రాధేయపడుదురు లేదా రక్షణకైనను సిద్ధపడుదురు. ఇట్టి కంపము కలిగింతువని నిన్ను స్తుతించుచున్నాము.

49. కొందరు నిశ్శబ్ధముగా తమయొక్క పనులు చేసికొనుచుండగా చుట్టుపట్ల కొందరు కేకలు వేయుచు ఫలానావారు వచ్చుచున్నారని అన్నప్పుడు విన్నవారు కూడా పనిమానివేసి చూచుచు ఆలకింతురు గదా! అలాగే

లోకస్థులందరు తమ పనులలో మునిగియుండగా మనము "క్రీస్తు ప్రభువు రెండవసారి శీఘ్రముగా రానైయున్నాడు" అని చెప్పవలెను మనమాటలకు వారి చెవులు గింగురు మనుట వలన మన వర్తమానము వారు ఆలకింతురు. కొందరు నమ్ముదురు కొందరు నమ్మరు. అయినను పరవాలేదు ప్రభువా నీ రాకడవార్త ఆ విధముగా మ్రోగించుము.

50. ప్రభువా! నరమాంస భక్షకులకు రక్షణవార్త. రాకడవార్త ఏలాగు అందును? ఎవరైన వెళ్ళిన యెడల వారిని పట్టుకొని చీల్చి తినివేయుదురు. అట్టివారు అస్సాములోను నాగరుకొండలలోను ఆఫ్రికాలోని అరణ్యములో నున్నారు. కొందరు దిగంబరులు, కొందరు కోతులవలె మారియున్నారు, వారికి తెలివిలేదు. వారికి రక్షణవార్త రాకడవార్త ఏలాగు అందగలదు వారికి సువార్త చెప్పుటకు కొందరు మిషనెరీలు వెళ్ళిరి. వారిని కూడ తినివేసినారు, వారు వేసికొన్న కోటులను కూడా తినివేసిరి. వారికి ఈ వార్త ఏలాగు వినిపించ గలము? జవాబు: వారికి రక్షణ సువార్త వినిపించుటకు మొట్ట మొదట కైలాసబుషిగారు వినిపించవలెను తరువాత సన్నిధికూటస్థులలో కొందరు వారికి రక్షణ సువార్త అందించవలెను. ప్రభువా నీవు మాయెడల ఏమిచేసిన ఆపనికి సిద్ధపడగలమో ఆ పని మాయందు నెరవేర్చి మమ్మును సిద్ధపర్చుము.

51. అవిధేయుడైన బిలామునకు గార్ధభంచేత మనుష్యవాక్కుతో వర్తమానం చెప్పించినావు. ప్రభువా! ఇప్పుడు నిన్ను నమ్మిన అన్యులు, నీరాకడ నమ్మని క్రైస్తవులు నామక క్రైస్తవులు ఉన్నారు. వారికి వారి స్వంత పశువులచేత సువార్త చెప్పించకూడదా? అట్లు చెప్పించిన నీ కార్యక్రమమునకు విరుద్ధమా? ప్రభువా ఏరీతినైన నీ రాకడ వార్త వారికి చెప్పించుమని వేడుకొనుచున్నాము.

52. ప్రభువా నీవు 5వేల మందికి ఆహారము కల్పించి పెట్టినావు కదా ఇప్పుడుకూడా అనేక వేలమంది బీదలకు పెట్టిన వారికి సువార్త చెప్పవచ్చును కదా! ఇది బైబిలు చరిత్రకు సంబంధించిన ప్రార్ధన.

53. యేసుప్రభువా! లోకములో ఏ పత్రికాధిపతివలనైనను ఏ



గ్రంథకర్తచేతనైనను ఈక్రింది చెప్పబడిన పత్రిక వ్రాయించుము. మొదటి గదిలో రాకడకు ముందు జరగవలసిన గుర్తులను, రెండవ గదిలో ఆ గుర్తుల యొక్క వచనములు బైబిలులో ఎక్కడనున్నదియును, మూడవ గదిలో ఏ తేదీలలో ఆ గుర్తులు నెరవేరినవి, నాలుగవ గదిలో బైబిలులో నెరవేరవలసిన గుర్తులు ఉన్నయెడల అవియును, అయిదవ గదిలో బైబిలులో లేకపోయినను రాకడను సూచించు గుర్తులను, ఆరవ గదిలో అవి నెరవేరిన తేదీలు, ఏడవ గదిలో పైరెండు గుర్తులు నెరవేరిన స్థలములు వ్రాయించుము లేదా సన్నిధికూటము లలో నీవైనా చెప్పుము. అప్పుడు ప్రచురణ చేయుదుము ఈ మా ప్రార్ధన నెరవేర్చుము.

54. యేసు ప్రభువా! నీవు త్వరగా వచ్చెదనని చెప్పి ఇంత ఆలస్యముగా వచ్చుచున్నావు. ఈ ఆలస్యము యొక్క అర్ధము మేము ఇతరులకు ఎట్లు చెప్పవలెనో మాకు నేర్పుము.

55. దేవుని సృష్టిలో, విశ్వాసి యొక్క ఆత్మలో కూడ గురుతులు అయిన తర్వాత త్వరగా వచ్చును. త్వరగా అని చెప్పియున్నాడు. గనుక త్వరగా వచ్చుచున్నాడని నమ్ముటయే విశ్వాసి యొక్క గురుతు. ఒకరికి పరిష్కారము కానప్పుడు నలుగురు కూడుకొని మన భావమేమి అని చెప్పుకొనవచ్చును. కాని విసుగు కొనరాదు. ప్రభువా నీవు త్వరగా వచ్చుచున్నావు కాబట్టి మమ్మును త్వరగా సిద్ధపర్చుము.

55. ప్రభువా అన్ని జనాంగముల నుండి నీ రాకడకు మనుష్యులను సిద్ధపర్చుకొనుము అన్ని బాషలలో నున్నవారిని రాకడకు సిద్ధపర్చుము. అన్ని స్థితులలో నున్నవారిని అనగా పాపస్థితిలో, వ్యాధిస్థితిలో, అవస్థల స్థితిలో, నిరాశస్థితిలో, మరణస్థితిలో ఉన్న వారిని నీ రాకడకు సిద్ధపర్చు కొనుము. నీ వాక్యము విన్నవారిని, వినియు నమ్మనివారిని, నమ్మియు తప్పిపోయినవారిని నీరాకడకు సిద్ధపరచుము. నరమాంస భక్షకులలో కొందిరినైన నీ రాకడకు సిద్ధపరచుము. భూలోకములో నున్నవారిలో కొందరు

రక్షణ గల మరణమునకు సిద్ధపడగలరు. కొందరు భక్తులైనప్పటికి రాకడకు సిద్ధపడలేరు. సిద్ధపడుట ఎవరికి ఇష్టమో వారిని సిద్ధపర్చుము దేవా చిన్నపిల్లలను దీవించుము. వారు నిన్ను అవమానపరచు ఏ పాపమును చేయలేదు గనుక వారిని గూడ నీ రాకడలో తీసికొనివెళ్ళుము. ఇట్టి మా ప్రార్థన ఆలకించినందులకు నీకు వందనములు.

57. సొదొమ పట్టణము నాశనమప్పుడు దేవదూతలు బలవంతముగ కొందరిని రక్షించి అగ్నిపాలు కాకుండచేసిరి అబ్రహాము ప్రార్ధనచేసెను గాని నెరవేరలేదు. అయినను నిరాశపడలేదు రాకడకు సిద్ధపడువారు కూడా తమ ప్రార్థనలు కొన్ని నెరవేరనప్పుడు నిరాశపడరాదు. ప్రభువా అట్టి సమయములో నిరాశపడకుండ మమ్మును కాపాడుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

58. ఒక గ్రామములో ఇంటి యజమానుడు తన కుమారునికి వివాహము ఏర్పరచును, మరియొక గ్రామములో తన కుమార్తెకు పెండ్లియేర్పాటు చేయునుగాని పెండ్లికుమారుడు పెండ్లి కుమార్తె మన దేశములో మాట్లాడు కొనరు. అయితే మానవులు పాపలోకములో పుట్టిరి. గనుక ప్రభువు తన స్వరక్తముతో శుద్ధిచేసెను గనుక ప్రభువు పెండ్లి సంఘముతో గదిలో సన్నిధిలో మాటలాడును సంఘమును పెండ్లికుమార్తెయు వరుడును ప్రభువును మాటలాడు చున్నారు. ఇట్టి చనువు సంఘమునకిచ్చిన ప్రభువా నీకు స్తోత్రములు.

59. దయగల యేసుప్రభువా! నీవు మా సన్నిధి కూటములోనికి వచ్చి రాకడ వర్తమానములు, ఇచ్చుచున్నందుకు వందనములు. మాకు తెలియ జేయుచున్న రాకడ వర్తమానములు లోకములోనున్న ప్రతివారికి తెలియ జేయుము. మాకు వర్తమానము తెలియజేసినప్పుడు ఏలాగు వ్రాసికొను చున్నామో అలాగే వారికి తెలియజేసి వ్రాసికొనునట్లు చేయుము. మాకు ప్రతిదినము తెలియజేయుచున్నట్లు నమ్మినను నమ్మకపోయినను వారికిగూడ తెలియజేయుము. నీమాటలు నమ్మి నిన్ను నమ్మకపోయినను నీవువెళ్ళి చెప్పుము అని యెహెజ్కేలు ప్రవక్తతో చెప్పినావు కదా! (2:4) మా పత్రికలలో



మేము చెప్పుచున్నాము గాని అది చాలదు. మేము స్వయముగా చెప్పినను చాలదు. నీవు చెప్పిన సరిపోవును, వారి హృదయమునకు జ్ఞానమునకు అందును. అధమపక్షము వారి జ్ఞానముకైన అందునట్లు చెప్పుదువని నిన్ను వందించుచున్నాము.

60. మాకు పట్టుదల లేదనియు, నీవు జవాబు చెప్పువరకు మేము కనిపెట్టుటలేదనియు, నీవు దర్శనములో చెప్పినావు ఆమాట నిజము. మేము పట్టుదల, ఓపికతో కనిపెట్టు శక్తి దయచేయుము. నీకు లెక్కకు మించిన వందనములు.

61. దేవుడు అబ్రహాముతో నేను చూపించు దేశమునకు వెళ్ళుమని చెప్పినప్పుడు ఎట్లుపోవలెను, అని అడుగలేదు. మరియు దేవుడు అబ్రహాము నకు కుమారుని ఇచ్చెదనని వాగ్దానము చేసెను. అబ్రహాము ఏలాగు ఇస్తావు ఎప్పుడు ఇస్తావు అని ప్రశ్నించలేదు. దేవుని మాట నమ్మి ఊరుకుండెను. కుమారుడు ఆలస్యముగా జన్మించినను విశ్వాసము చెడలేదు. శారా నమ్మలేదు, నవ్వినందుకు ప్రభువు కోపపడెను, అబ్రహాము కూడా నవ్వినాడుగాని దేవునికి అసాధ్యమైనది లేదని నమస్కరించి నమ్మెను. అబ్రహాము కుమారుడైన ఇస్సాకు ముంగుర్తుగా నున్న యేసు ప్రభువు యొక్క రెండవ రాకడను గురించి రెండువేల సంవత్సరములనుండి కనిపెట్టు చున్నాము మనము ప్రార్థించి, నమ్మి విసుగుకొనక సిద్ధపడవలెను రాకడకు సిద్ధపడుటలో అబ్రహాముయొక్క విశ్వాసము దయచేయుదువని నమ్మి నీకు నమస్కారములు చెల్లించుచున్నాము.

62. ఇస్సాకు అను పెండ్లి కుమారుడు, రిబ్కా అను పెండ్లికుమార్తెయున్న ఊరు వెళ్ళలేదు. ఎలియాజరు అను అబ్రహాము యొక్క సేవకుడు పెండ్లి కుమార్తెను తీసుకొనివచ్చెను. పెండ్లికుమార్తె ఊరికిని, పెండ్లికుమారుని ఊరుకిని చాలా దూరము. అలాగే మేఘములపై పరలోకములోనున్న నీతి సూర్యుడైన యేసుప్రభువునకును భూమిమీదనున్న సంఘమునకును

చాలాదూరము. ఎలియాజరు పరిశుద్ధాత్మకు ముంగుర్తు. ఎలియాజరు రిబ్కాను తయారుచేసినట్లు ఇప్పుడు పరిశుద్ధాత్మ సంఘమును తయారుచేయుచుండెను. ఎలియాజరు రిబ్కాకు నగలు ఇచ్చినట్లు పరిశుద్ధాత్మ సంఘమునకు వరములు అనే నగలు ఇచ్చి తయారుచేయుచు అలంకరించుచున్నాడు. ఇప్పుడు ఆపని జరుగుచున్నది. రాకడ సంఘములోనున్న మనలను పరిశుద్ధాత్మ తయారు చేయును. రిబ్కా తనంతటతాను తయారు కాలేనట్లు మనంతట మనము పెండ్లికుమార్తెగా తయారుకాలేము. ఎలియాజరు, రిబ్కా అను పెండ్లి కుమార్తెను తయారుచేసి ఇస్సాకునొద్దకు తీసికొని వెళ్ళినట్లు పరిశుద్ధాత్మ భూమిమీదనున్న సంఘము అను పెండ్లి కుమార్తెను సిద్ధముచేసి మేఘములోనున్న నీ యొద్దకు తీసికొనివచ్చును. ఆ సంఘములో మేముకూడా ఉండునట్లు నీ కృపదయ చేయుము ఎలియాజరుతో వెళ్ళుదువా అని రిబ్కాను తనవారు అడిగినప్పుడు ఆమె వెళ్ళెదనని జవాబు చెప్పెను ఆలోచించి చెప్పుదుననలేదు. చాటునకు పోలేదు. సిగ్గుపడలేదు. తలవంచుకొనలేదు. వెళ్ళడానికి నిశ్చయించుకొన్నది. ఎలియాజరుతో వెళ్ళుటకు (రెడీ) సిద్దము. నీళ్ళుపోయమనగా తన ఒంటెలకు పోయుటకు (రెడీ) సిద్ధము, ఇల్లు చూపించెదవా? అనగా బస, భోజనము (రెడీ) సిద్దము అని చెప్పెను ఇంటిదగ్గర ఎవరిని అడుగకముందే సిద్ధము అని చెప్పెను అలాగే సంఘము అను పెండ్లికుమార్తె రిబ్కా వలె ప్రభువు నీ విషయములన్నిటిలోను సిద్ధముగానుండి (రెడీ) సిద్ధము ప్రభువా అని చెప్పవలెను. అట్లు మేము అన్ని విషయములలో సిద్దముగా నుండే కృప దయచేయుదువని నమ్మి నీకు మంగళ స్తోత్రములర్పించుచున్నాము.

63. యేసుప్రభువా ఇతర మతస్థులు కొందరు ఇట్లనుచున్నారు. పోతులూరి వీరబ్రహ్మముగారి శిష్యుడు వసంతరాయుడు మిక్కిలి త్వరలో రానైయున్నాడు. వసంతము ఎఱ్ఱగానుండును. గనుక అది రక్తమునకు గుర్తట, మరియు "రాయుడు" అనగా ప్రభువట అనగా రక్తము చిందించిన యేసుప్రభువు త్వరగా వస్తాడని పోతులూరి వీరబ్రహ్మముగారి అభిప్రాయమట.



ప్రభువా దీని భావమేమిటి తెలియజేయుము, 2) ఆయన వచ్చి పదివేల సంవత్సరములు శాంతి రాజ్యము ఏలును అని హిందువులు నమ్ముచున్నారు. దీని విషయము మాకేమి తెలియజేదువు 3) ఎవరో ఒక గొప్ప వ్యక్తి భూమిమీదకి వచ్చునని మహమ్మదీయులు చెప్పుచున్నారు. ఆయన ఎవరైనది ప్రభువా తెలియపర్చుము, 4) మరియు లోకమంతటిని మార్చుటకు ఎవరో ఒకరు వచ్చెదరనియు ఆయన వచ్చిన గాని ఎవరో తెలియదనియు (క్రీస్తుప్రభువు లేక మహమ్మదు లేక చింద్వాడు లేక రాయలు) వచ్చిన తరువాత పోలికను బట్టి తెలియుననియు దివ్యజ్ఞానులు చెప్పుచున్నారు. ఇంకా కొందరు ఏమనుచున్నారు, రోడ్డు అని ఒక బాషవారు, తెలుగువారు బాట అని, మహమ్మదీయులు రాస్తా అంటారుగాని అన్ని ఒక్కటేగదా! అలాగే ఎవరు ఏది అనుకొన్నవచ్చుచున్న ఆయన దేవుడు అనుచున్నారు. ప్రభువా నీవు వచ్చుచున్నావని మాకు తెలిసినది. గనుక వారికికూడా తెలయపర్చుము.

64. యేసు ప్రభువా! నీ మొదటి రాకడను పాతనిబంధన భక్తులు ఎంత ఆశతో కనిపెట్టినారో అలాగే క్రొత్తనిబంధనవారమైన మేము నీ రెండవ రాకడకు అంత ఆశతో కనిపెట్టునట్లు మమ్మును ప్రేరేపించుము.

65. ఆహ్వానపత్రికను భూలోకములో పెండ్లిసయములో ఆహ్వాన కార్డులు అచ్చువేసి పంపించెదరు. రాకడ తర్వాత పరలోకములో పెండ్లివిందు జరుగును. ఆవిందులో పెండ్లి కుమార్తెనిలిచియుండును. ఈ పెండ్లికుమార్తె సువార్తవలన ప్రార్థనవలన, మారుమనస్సుపొంది మోక్షములోనున్న వారిని ఆవిందుకు పిలచెదరు గనుక ఇప్పుడే మనము అందరికి సువార్త వినిపించ వలెను. ఈలోకములో సువార్త ప్రకటించుటే పెండ్లికార్డు అందించుట. గనుక సువార్త పని నిర్లక్ష్యపెట్టకూడదు ఇట్టి ఆహ్వాన పత్రికవిషయములో శ్రద్ధవహించవలెను అట్టి శ్రద్ధ మాలో పుట్టించుమని నిన్ను స్తుతించుచున్నాము.

66. ప్రభువా! మాకు భూలోకములో రక్షణవిందు అనుభవించు భాగ్యము దయచేసినావు వందనములు. అలాగే రాకడ విందు అనుభవించు భాగ్యము

దయచేయుము వివాహము కాకముందే పెండ్లికుమార్తె తన గృహమునందు విందు చేయునుగదా! అదే భూలోకములోని రక్షణవిందు రాకడ అయిన తర్వాత ఏడేండ్ల అసలువిందు జరుగును. మేము ఆవిందులో పాల్గొనుకృప దయచేయుదువు గనుక నీకే స్తోత్రములు.

67. దేవుడు భూలోకములో నున్నవారిని ఎవరిని విడిచిపెట్టడు. అందరికి సువార్త వినిపించనిదే అంత్యతీర్పు రానివ్వడు హెడెస్సులోనున్న వారికి కూడ భోదించవలెను. రాకడ తర్వాత పరలోకములో నున్న రక్షితులను విందుకు పిలుచును అనగా రక్షణ గలిగినవారికి అంతస్థు పెండ్లికుమార్తె యొక్క విందుకు రానిచ్చుట వీరు విందు చూచుటమాత్రమే కాక విందు అనుభవించుటకు కూడ పిలువబడుదురు, పెండ్లికుమార్తె తన సువార్త వలన రక్షింపబడిన వారిని విందుకు ఆహ్వానించవలసినదిగా ప్రభువు కోరుకొనెను. ఆ సమయమున భూలోకములో 7సం॥ల శ్రమలలో అవిశ్వాసులు బాధపడుచుందురు. పరలోకములో పెండ్లి కుమార్తె రక్షితులు విందులో నుందురు. అందువలన అవిశ్వాసులకు, సాతానుకు, సిగ్గు అంతేకాదు పరాభవమే అపజయము వచ్చినదని గోల పెట్టుదురు, రక్షితులైన వారు పెండ్లివిందుకు వెళ్ళు హక్కుచూచి మరింత సిగ్గుపడుదురు. ఈవిందు సమయములో పెండ్లికుమార్తె మహిమ వెలుగు, కాంతి రక్షితులు చూడలేరు, గనుక పెండ్లికుమార్తె తన ముఖముపై ముసుగు వేసికొనును ప్రభువా ఇట్టి మహిమగల విందులో నుండుటకు మమ్మును తయారుచేయుదువని నమ్మి నీకు హారతులొసగుచున్నాము.

68. ఏనుగు నీడ పెద్దది. సూది నీడ చిన్నది. రెండును నీడలె ఎట్టి బలహీనత ఉన్నను చీకటియై యున్నది. ఏవిధమైన చీకటి లేకుండ తండ్రీ మమ్మును క్రమపర్చుము. మేము ఈ భూలోకములో పొందవలసిన మహిమ పొందగలుగునట్లు క్రమపర్చుము. పరలోకములో అందరికన్న ఎక్కువ మహిమనూతన యెరూషలేము వాస్తవ్యులకు ఉన్నది. గనుక మాలో



ప్రతివారిని ఆ మహిమ జీవితమునకు సిద్దపర్చుము. ఇట్టి స్థితికి అన్నీ అడ్డులే, వ్యాధి మొదలగు అడ్డులు గలవు. అయినను యిట్టి అడ్డులన్నియు తొలగించుకొని ఆ మహిమకు సిద్దపడు బాగ్యము అనుగ్రహించుము. మా తప్పులు, పొరపాట్లు దిద్దుకొనుటకు ప్రయాసపడునట్టి కృప మాకనుగ్ర హించుము. నీవు అందుకు కావలసిన గడువులు సాధనములు యిచ్చుచున్నావు. మేము సంపూర్తిగా ఈ నిమిషమందు మారునట్టి కృప దయచేయుము మేమట్లు మారుట కష్టము కాదు, నీ వాక్యములో ఒక మాట వ్రాయించినావు అదేమనగా నీ యాజ్ఞలు భారమైనవి కావు గనుక మేము నిన్ను బట్టి నెరవేర్చగలము. గనుక స్తోత్రము. యెహోనువలె నీ యాజ్ఞలు భారమైనవి కావని మేము చెప్పగల భాగ్యము అనుగ్రహించుము. ఈ నిమిషములోనే సంపూర్ణ స్థితికి మేము రాగల కృప దయచేయము, మేము తర్వాత అని జరుపుకొనక త్వరగా సిద్ధపడు భాగ్యము అనుగ్రహింపుము, నీ వాక్యము నీ సృష్టి మేము గుణపడునట్లు మాకు భోధించుచున్నవి గనుక నీకు స్తోత్రము. మేము మొదట మారి తరువాత ఇతరులు మారుటకు మార్గమును చూపునట్లు మమ్మును మాదిరి జీవితముగల వారినిగా మార్చుము మాజీవితము నూతన యెరూషలేమునకు తగు జీవితముగా క్రమపరచుము మేము అన్ని విషయములలోను మందభాగ్యులమై యున్న ఏలాగు నూతన యెరూషలేము చేరగలము? కొందరు ఎంత విన్నను ఫలితము కనబడదు. వారు మార్పు చెందరు. కొందరు త్వరగా మారిపోవుదురు. సిలువదగ్గర ఒకరు మారినారు ఇంకొకరు మారలేదు. పెండ్లికుమార్తె వరుసలోని వారుకూడ మందస్థితిలో నున్నారు. గనుక మెళకువ స్థితిగలిగి జాగ్రత్తపడు కృప దయచేయుము.

69. ఓ తండ్రీ! పదియాజ్ఞలను బట్టి మా హృదయమును శుద్ధిచేసికొనుట కొంతవరకు నేర్చుకొన్నాము. గాని మా జ్ఞానమునకు తోడుగాను మనస్సాక్షికి తోడుగాను నీ రాకడకు ఎట్లు సిద్ధపడవలసినది నీ ఆత్మచేత కూడ నేర్పించుమని వేడుకొనుచున్నాము.

70. నీ వాక్యమంతయు చదివి మమ్ము నేలాగు శుద్ధీకరించుకొన వలసినది కొంతవరకు నేర్చుకొన్నాము. ఈ వాక్యజ్ఞానమునకు తోడు నీ పరిశుద్ధాత్మ సహాయము నిచ్చి మా జ్ఞానము వెలిగించి నీరాకడకు ఎట్లు సిద్ధపడవలసినది నేర్పించుమని వేడుకొనుచున్నాము.

71. ఇతరులకు సువార్త ప్రకటించుటవల్ల మా ఆత్మీయ జీవనమునకు బలము కలిగించు సాధనము దొరుకునని గ్రహించినాము అయితే ముఖ్యముగా నీ రాకడను బోధించు సేవవలన కూడా నీ రాకడకు మేమెట్లు సిద్ధపడవలెనో నీయాత్మచేత నేర్పించుమని వేడుకొనుచున్నాము.

72. ప్రార్థన చేయుటవలన అనగా మా పాపములు ఒప్పుకొనుట వలనను, మాకు కావలసినవి ఇమ్మని నిన్నువేడుకొనుటవలనను, పూర్తిగా మేము నీకు సమర్పణ అగుటవలనను, నిన్ను స్తుతించుటవలనను మేము మంచి స్థితిలోనికి తయారు కాగలము. వీటితోడు నీ యాత్మ సహాయము కూడ దయచేసి మమ్మును నీ రాకడకు సిద్ధపరచుమని వేడుకొనుచున్నాము.

73. మేము ఏమిచేసిన రక్షణ స్థితిలోనికి రాగలమో, ఏమిచేసిన రక్షణ నిలుపుకొనగలమో, ఏమిచేసిన ఆత్మీయ జీవమును నిలుపుకొనగలమో, అన్నీ మేము చేయుటకు ప్రయత్నించుచున్నాము, మేము రాకడకు సిద్ధపడుటకు ఇవన్ని మాకు సహాయకరముగా నుండునట్లు నీ పరిశుద్ధాత్మ వలన మమ్మును నడిపించుమని వేడుకొనుచున్నాము.

74. మేము ప్రత్యేక కూటములు పెట్టుకొని రాకడను గూర్చియు, రాకడకు సంబంధించిన విషయములను గూర్చియు నేర్చుకొనుచున్నాము, గాని నీ యాత్మ సహాయము ప్రతి విషయములో మాకు అవసరము. మా స్వంత జ్ఞాన ప్రయత్నము మా విశ్వాస ప్రయత్నము చాలదు. గనుక ప్రత్యేకమైన రీతిని నీయాత్మ సహాయము కోరుకొనుచున్నాము. గనుక ఏమేమి చేసినయెడల నీ రాకడకు సిద్ధపడగలమో అట్టివి మాచేత చేయించుమని వేడుకొనుచున్నాము.

75. ఏయే గుర్తులవలన మేము నీ రాక సమీపమని తెలిసికొనగలమో,



ఆయా గుర్తులు మాకు బైబిలులోను, లోక చరిత్రలోను, సంఘములోను, సృష్టిలోను, చూపించి వాటివలన నీ రాకడ సమీపమని మేము గ్రహించి సిద్ధపడుటకు నీ యాత్మ సహాయము దయచేయుము. ప్రతిచిన్న విషయము లోను, నీయాత్మ సహాయము మాకు దయచేసి నీ రాకడకు ఆయత్తపరచుమని వేడుకొనుచున్నాము.

76. వీటిద్వారా కాకుండా ఇంక వేటిద్వారా నీ రాకడ సమీపమని మాకు తెలియజేయుట నీచిత్తమో అట్టివి కూడ మాకు తెలియజేయుము మేము అంగీకరింతుము. పూర్వకాలమందు విశ్వాసులకు నీవు దర్శనములో కనబడి చెప్పవలసిన సంగతులు చెప్పియున్నావు, అది నీ చిత్తమైయున్నది. ఈకాలములో కూడా మాలో ఎవ్వరికైన దర్శనములో కనబడి చెప్పవలసిన సంగతులు చెప్పమని వేడుకొనుచున్నాము. అట్టి సమయములో నీయాత్మ యొక్క సహాయము మాకు ఎక్కువ అవసరము. ఎందుకనగా పిశాచివలనను, కొందరి స్వంత ఊహలవలనను తప్పుడు దర్శనములు కూడ రావచ్చును. వీటికి మేము భయపడకూడదు, ఎందుకనగా ఎవరు నీకు సమర్పణ అయినారో, ఎవరు నీ చిత్తప్రకారము చేయనిశ్చయించు కొందురో వారికి తప్పుడు దర్శనములు రావు. నీ కృప మాకు దయచేసి మమ్మును కనికరించుమని వేడుకొనుచున్నాము.

77. రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటలో లోతు ఆలస్యము చేయుట నీవు కనిపెట్టి అయ్యో త్వరపడలేక పోవుచున్నాడు గదా అని నీవు కనికరించి, ఆయన చేతులు పట్టుకొని నడిపించుకొని వెళ్ళినావు ఇది ఎంత అద్భుతకరమైన కృప అలాగుననే మాకు తెలిసిన ఏడేండ్ల శ్రమ తప్పించుకొనగోరు మేము రాకడకు త్వరపడు విషయములో మేము జాగుచేయుట నీకు తెలియును. గనుక మామీద నీ కనికరముంచుమని వేడుకొనుచున్నాము.

78. ఓ తండ్రీ! జీవాంతమందు ఎవరు ఎక్కడికి వెళ్ళునది నీకు ముందుగా తెలియును. కొందరు నూతన యెరూషలేమునకు సజీవులగుంపులో వెళ్ళుదురు. కొందరు మృతుల గుంపులో నూతన యెరూషలేము చేరుదురు. కొందరు

ఏడేండ్ల శ్రమలో సిద్ధపడుదురు. కొందరు వెయ్యేండ్లలో తయారగుదురు రక్షింపబడిన వారిలో కొందరు పరలోకములో నుందురు. కొందరు రక్షింపబడి మారిపోయిన భూలోక మోక్షములో నుందురు. ఈ గుంపులన్నియు గలవని నీ వాక్యము వల్లనే నేర్చుకొన్నాము. గనుక నేను ఏ గుంపులోనికి చేరవలయునో ఆ గుంపులోనికి తయారుకాగల కృప దయచేయుము. నేను వేరే గుంపులో చేరవలెనని ప్రయత్నము చేసిన అది నా గుంపు కాదు గనుక నెరవేరదు. గనుక నాది ఏ గుంపు అయిన అందులో చేరగల కృపదయ చేయుము. మరియు ఓ ప్రభువా! నేను ఫలాని గుంపులో చేరుమని నా మనస్సాక్షి చెప్పినది నిరుకుకాదు నన్ను గురించి ఇతరులకు వచ్చు దర్శనములను బట్టి కూడ నిరుకుకాదు. నా స్వపరీక్ష చెప్పునది కూడ ఖాయము కాదు. గాని నీకుయేది తెలియునో అదే ఖాయము. నీవు నాకు ఏది చెప్పుదువో అదే ఖాయము గనుక ఈ కాలములో కొందరికి దర్శనములో కనబడి వారికి చెప్పుచున్నావని వింటున్నాము గనుక నాకు కూడ కనబడి చెప్పుము ఆ విధముగా చెప్పుట నీకిష్టమయిన చెప్పుము. నీకిష్టము కాకపోయిన యెడల నాకు చెప్పకుము. గాని నేను సజీవుల గుంపులో నూతన యెరూషలేములో చేరుటకు ముఖ్యమైన పనులును ప్రార్ధనలును నేను చేయుదును. అడ్డములు వచ్చినను శ్రమలు వచ్చినను, నేను వీటిని ఎక్కువగా చేయుదును గనుక దీవించుము. నేను ఒకరి ప్రార్ధనమీద ఆనుకొనను, గాని ఆత్మ అందింపును బట్టి ప్రార్ధన చేయుదును.

షరా:- జ్ఞానముతోను, అనగా మనస్సుతోను, స్వంత ఆత్మతోను యేమిచేసినను చేయవచ్చు గాని స్వంత ఆత్మ పరిశుద్ధాత్మ వలన వెలిగింపబడవలెను అందుకే మనో నిదానము అవసరము.

79. సజీవుల గుంపులో నుండు వారికి ఉండవలసిన లక్షణములు 1) బైబిలు చదువుట, 2) ప్రార్ధన చేయుట, 3) స్తుతులు చేయుట, 4) సువార్త అందించుట, 5) ప్రవర్తన సరిజూచుకొనుట, 6) శ్రమ సహించుట 7) చందాలిచ్చుట, 8) జ్ఞానమును సరియైనరీతిగా వాడుకొనుట.



80. పరీక్షాంశములు

| | |
|---|---|
| 1) బైబిలు చదువుచున్నావా? | ఆ గురితో |
| 2) ప్రార్ధన చేయుచున్నావా? | ” |
| 3) స్తుతులు చేయుచున్నావా? | ” |
| 4) సువార్త పని చేయుచున్నావా? | ” |
| 5) చందా వేయుచున్నావా? | ” |
| 6) శ్రమ అనుభవించుచున్నావా? | ” |
| 7) ప్రవర్తన సరిపోయినదా? | ” |
| 8) జ్ఞానము సరిపోయినదా? | ” |

ఆగురితో అనగా రాకడకు సిద్ధపడు గురితో పై పనులన్నియు చేయుచున్నావా?

81. శుద్ధి ప్రార్ధన : మహాపరిశుద్ధుడవైన ఓ తండ్రీ! నేను ఈ లోకములో ఎంతకాలము జీవించవలెనో అంతకాలము నీ దృష్టిలో పవిత్రముగా జీవించుటకు నీ వాక్యములో నున్న ఆజ్ఞలను బట్టి నా హృదయమును శుద్ధిచేసికొనుట యెంత అవసరమో నేను నీ యొద్దకు వచ్చుటకు నా జీవిత మంతటిని శుద్ధిచేసుకొనుట అంత అవసరము గనుక ఈ శుద్ధి కార్య విషయములో నీ పరిశుద్ధాత్మ సహాయము అనుగ్రహించుమని నిన్ను వేడుకొనుచున్నాము. ఈలోకమునకు సరిపోవు శుద్ధి కాదుకాని ఈ లోకమునుండి మహిమ మేఘము మీదికి వెళ్ళుటకు అవసరమైన శుద్ధి కావలెను.

షరా:- ఈ శుద్ధి ప్రార్ధన యొక్క ప్రతి అంశములోను ప్రార్ధన స్తుతి రెండును ఉండవలెను. మరియు ప్రార్ధన చేయునప్పుడు పరిశుద్ధాత్మ పేరు ఎత్తి, పరిశుద్ధాత్మ సహాయము దయచేయుమని అడుగవలెను. లోకజీవనశుద్ధి కొరకు పది ఆజ్ఞలు ఉపయోగపడును. ఈ రాకడకు సిద్ధపడు శుద్ధి రాకడకు సిద్ధపడవలసిన వాక్యములను బట్టి శుద్ధి కావలెను.

## ప్రార్థన

1. లోపములను తెలిసికొనుట పది ఆజ్ఞలను బట్టి
2. రాకడ వాక్యములను జ్ఞాపకము చేసికొనుటను బట్టి
3. ఎవరు శుద్ధిచేయుట : పరిశుద్ధాత్మ తండ్రి
   దేనితో శుద్ధి : క్రీస్తు రక్తములో

## స్తుతి

1. విశ్వాసముతో తండ్రి క్షమించినాడని స్తుతిచేయుట
2. ఆ వాక్యములు మనయెడల నెరవేరినవని స్తుతించుట
3. పరిశుద్ధాత్మ తండ్రికి స్తుతి
4. రాకడలో ఎత్తబడుదునను ఆనందము నమ్మకము పరిశుద్ధాత్మ తండ్రివలననే కలుగును.

82. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినాము గనుక రాకడలో ఎత్తబడుదుమను సంతోషముండును. అయితే జాగ్రత్తగా నుండవలెను. లేకపోయిన స్థితి తగ్గిపోవును. ఉదా: చీకటిలో వెళ్ళుచున్న కుర్రవానితో పెద్దవారు (లైటు ఉన్నను జాగ్రత్తగా నడువు అందురు) అంతేకాదు గాలివల్ల లైటు ఆరిపోవచ్చును. లాంతరు ఉన్నను అది ఆరిపోకుండ నుండవలెను. మహా పరిశుద్ధుడవైన ఓ తండ్రీ! నేను ఎత్తబడువారిలోనుండు నిమిత్తము నేను చేసిన శుద్ధిప్రార్థన నీవు ఆలకించినావని నమ్ముచున్నాను. ఆనందించుచున్నాను, అన్ని మేళ్ళకంటె గొప్ప మేలైన ఈమేలు నిమిత్తమై కృతజ్ఞతతో స్తుతించుచున్నాను. అన్ని మేళ్ళకంటే గొప్ప మేలైన ఈ మేలు నిమిత్తమై కృతజ్ఞతతో స్తుతించుచున్నాను. ఈ స్తుతివల్ల కలిగే ఆనంద దీపము ఆరిపోకుండ చేయుదువని నేను నమ్ముచున్నాను. ఈ గొప్ప కార్యములు నాలో పరిశుద్ధాత్మ వలన రాకడవరకు నిలుచుననియు, జరుగుననియు, నిరీక్షించుచున్నాను.



## పెండ్లి కుమార్తె

పరలోకములో గొర్రెపిల్ల యొక్క వివాహము జరుగును. ఆ వివాహమునకు సంఘము పెండ్లికుమార్తెగా కూర్చుండును ఈ సంఘమునకు వరుసకు క్రీస్తు ప్రభువు పెండ్లికుమారుడగును లేక గొర్రెపిల్ల యగును. ఏలాగనిన యేసుప్రభువు గొర్రెపిల్లయై సిలువమీద దహన బలియైన తన స్వంత రక్తమును ధారపోసి దానితో సంఘమును ఆస్తిగా కొనియున్నాడు. గనుక సంఘము పెండ్లికుమార్తెయైనది అది యిప్పుడు మనము ఆలోచించు అంశమైయుండవలెను. యూదులు ఒక్కరే సంఘమైయుండలేదు. గాని యూదులు అన్యులు కలసి సంఘమగును. యూదులు ఆయన లోకరాజని తప్పు అభిప్రాయపడి ఈ భాగ్యము పోగొట్టుకొనిరి మనము కూడా పెండ్లికుమారుని విషయములో యేవిధముగ పొరబడినను ప్రేమ తగ్గినను పెండ్లికుమార్తె వరుసలోనికి చేరలేము గనుక జాగ్రత్తపడవలెను. పెండ్లి కుమార్తెగా ఎత్తబడువారికి ఉండవలసిన లక్షణములు: విజ్ఞానము, విన్నపము, విశ్వాసము, విధేయత.

1) విజ్ఞానము – రాకడను గూర్చి యావత్తు పూర్తిగా తెలసికొనవలెను. 2) విన్నపము–ప్రార్థించవలసిన సంగతులన్నియు ప్రార్థింపవలెను. 3) విశ్వాసము – ప్రభువు నన్ను పెండ్లికుమార్తె వరుసలోనికి చేర్చుకొనునని నమ్ముట. 4) విధేయత వాక్యము చెప్పిన రీతిగా అనగా ప్రభువు చెప్పినట్లు చేయుట.

పదిమంది కన్యకలలో (మత్తయి 25అ. అయిదుగురు మిగిలిపోయిరి) కారణమేమనగా పెండ్లికుమారుని మీద ప్రేమ కొద్దిగా తగ్గినది ప్రకటన 2:4 గనుక ప్రభువా పెండ్లికుమార్తె వరుసలోనికి వచ్చువారిని త్వరగా సిద్ధము చేయుమని ప్రార్థించవలెను.

## రాకడకు సిద్ధపడుట

1. బైబిలు అంతయును తెలిసికొనవలెను. 2. సువార్త పని ముగించి యుండవలెను. అనగా ఎవరికి చెప్పగలమో వారికి చెప్పి యుండుట, పత్రికాదులు మొదలైనవి పంచిపెట్టుట. 3. చేయవలసిన ప్రార్థనలన్నియు

ముగించవలెను. 4. ఇవ్వవలసిన చందాలన్నియు ఇచ్చి వేయవలెను. తీర్చవలసిన అప్పులన్నియు తీర్చివేయవలెను. 5. తప్పులు ఒప్పుకొని ఇతరులతో సమాధానపడవలెను. 6. ఇది వరకు వ్రాసికొన్న నోట్సులు ఒక పర్యాయము చూచుకొనవలెను. 7. చేయవలసినవి చేతునను తీర్మానము చేయవలెను. 8. ఇదివరకు నోట్సు మీదను, ఇతరుల ప్రార్ధనమీదను ఆనుకొన్న యెడల ఇప్పుడది మానివేయవలెను. మీకు మీరే ప్రార్ధనాస్తుతులతో కనిపెట్టవలయును. వాక్యము ఆధారము చేసుకొని ప్రభుయేసునందలి విశ్వాసముతో సిద్ధపడవలెను. రాకడను గురించి పత్రికలలోను, నోట్సులలోను, ఉండు సంగతులన్నియు చదివియుండవలెను. 9. మనము చేయుదుమని చేయనియెడల ప్రభువు తనపని యెట్లుచేయునని నీవు చెప్పగలవు సిద్ధపడు టలో ఆలస్యము చేయగూడదు. నీవు వెళ్ళి ఆలాగు చేయుమని ప్రభువు ఒక ధనికునితో చెప్పెను. ఎవరు చేయవలెను ప్రభువా అని అడుగనక్కరలేదు గనుక ఎవరు చేయవలసినది వారు చేయవలెను నాకు రాకడను గూర్చి తెలియలేదు. తెలిసికొనకపోవుట ఎవరి తప్పు. నీవు రక్షింపబడిన తర్వాత ఎక్కువ సేవచేసిన ఎక్కువ ఫలితము పొందుదువు. గాని రాకడలో పాలెక్కడ? నీవెక్కువ బైబిలు చదివిన ఎక్కువ జ్ఞానము పొందుదువు గాని రాకడలో పాలు యెక్కడ, నీవెక్కువమందిని గూర్చి ప్రార్ధన చేసిన యెక్కువ ఫలితము పొందుదువు గాని రాకడలో ఫలితము నీకు ఎక్కడ? యెక్కువ సువార్త పని చేసిన యెక్కువ సువార్త ఫలితము పొందుదువుగాని రాకడలో పాలెట్లుండును? యెక్కువ చందావేసిన దానికి ఫలితముగాని రాకడలో పాలెట్లుండును? రాకడకు సిద్ధపడితేనే రాకడలో పాలుండును. 10. జలప్రళయము కథ దానియేలు 2,7 అధ్యాయములు, ఏలియా ఆరోహణము హనోకు ఆరోహణము మార్కు 13:32-37. రాకడను గూర్చి ప్రభువు చెప్పిన మాటలు అపోస్తులుల మాటలు పూర్తిగా నేర్చుకొనవలెను.

ప్రశ్నలు : చదువరీ క్రీస్తుప్రభువు త్వరగా వచ్చుననగా ఆయన వచ్చుటకు



అయనకేమియు అడ్డములు లేవని అర్ధమనియు, గురుతులైన తరువాత త్వరగా వచ్చుననియు గ్రహించినావా? 2.ఫలానప్పుడు వచ్చెదనని ప్రభువు తారీఖు చెప్పలేదు. గనుక ఎప్పుడు బడితే అప్పుడే ఆయన వచ్చునని గ్రహించినావా? 3. బహిరంగమైన గురుతులే కాదు. ప్రభువు నీకు స్వయముగా చెప్పిన గురుతు గ్రహించినావా? 4. నీవు రక్షింపబడియున్నావని నీకు నిశ్చయమేనా? ఇదికూడ ప్రభువు నీకు చెప్పినాడా? 5. నీవు పరిశు ద్ధాత్మ బాప్తిస్మము పొందినావని ప్రభువు నీకు చెప్పినాడా? ఇది నిశ్చయమేనా? 6. ఇంతకాలము సిద్ధముగా నుండి ఆయన వచ్చునప్పుడు చల్లపడెదవని నీకు తోచినదా? 7. చెప్పబడిన వారందరు అబద్ధ ప్రవక్తలు కారనియు, బైబిలులో చెప్పబడిన అబద్ద ప్రవక్త ఏడేండ్లలో వచ్చుననియు గుర్తించినావా? 8.అబద్ధప్రవక్తలైనను అంత్య క్రీస్తులైనను క్రీస్తు యొక్క దైవత్వము ఒప్పుకొనని వారికిని, లోకము యొక్క ఆందోళన చూచి రెండవరాకడ దగ్గరపడినదని చెప్పిన ఇవన్ని 2000 సం॥ముల నుండి ఉన్నవేగాని క్రొత్తవి కావు. చెప్పువారికిని గుర్తులు కొన్ని స్థలములలోనేగాని అన్ని స్థలములలో లేవను వారికిని ఈ రీతిగా రాకడకు ఎదురు ప్రశ్నలు వేయువారికి జవాబు చెప్పగలవా? 9. నేను తప్పకుండ ఎత్తబడుదును విశ్వాసమును బట్టి ఆనందించువారికిని నేను రాకడ సంగతులన్నియు నేర్చుకొన్నాను గనుక ఎత్తబడుదునను వారికిని, నాయందు అభిమానముగల వారందరు నన్ను గురించి ప్రార్థించుచున్నారు గనుక నేను ఎత్తబడుదునను వారికిని, నేను బాప్తిస్మము పొందినాను గనుక ఎత్తబడుదునను వారికిని, మనవలె ఇన్ని సంగతులు నేర్చుకొనక, సిద్ధపడక యేసుప్రభుని నమ్మిన వారిని ఆయన తీసికొని వెళ్ళును గనుక నన్ను కూడా తీసికొని వెళ్ళును అనువారికి, ఆయన రాకడను గూర్చి కూడా సువార్త ప్రకటనలో చేర్చి ప్రకటించుచు అనేకమందిని నమ్మింపజేయుచున్నాను. గనుక తప్పకుండ ఎత్తబడుదునను వారికి చెప్పు జవాబు నీ దగ్గర నున్నదా? ఇవన్నియు ఎత్తబడుటకు నిజమైన కారణములేనా?

పై సంగతులు అనుకొనువారిని గురించియే పరిశుద్ధాత్మకు విరోధమైన పాపమనియు హెబ్రీ 6:1-7 వ॥లు ప్రభువు చెప్పుచున్నారు. 10) ఎత్తబడుదువని పైన చెప్పిన విధముగా సంతోషించు వారికి యెహెజ్కేలు 33:23-30లో ఉన్న సంగతిని గూర్చి జ్ఞాపకము చేసినావా? 11) ఎవరు వాక్యము విందురో, యెవరు విశ్వసించి ఆప్రకారము విధేయులై నడుచు కొందురో, యెవరు విశ్వసించి ఆ ప్రకారము విధేయులైనడుచుకొందురో, యెవరు ఎత్తబడవలసిన నూతన యెరూషలేములో నుండు కాంతి చూచుటకు భూలోకములో తర్ఫీదులగుదురో, యెవరు యోహానువలె ఈ లోకములో యేసుక్రీస్తు ప్రభువుతో మిక్కిలి సహవాసము చేయుదురో అట్టివారు ఎత్తబడుదురు. 12) అబద్ధ ప్రవక్తలు ఎవరు? ఎ) క్రీస్తు అక్కడ ఉన్నాడు, ఇక్కడ ఉన్నాడు అని చెప్పువారు అబద్ధ ప్రవక్తలు అలాగు అనని వారిని చూచి కొందరు బోధకులు ఇతర బోధకులను అబద్ధ ప్రవక్తలని చెప్పుచున్నారు. అట్లు ఇతరులను అబద్ధ బోధకులనువారే అబద్ధ ప్రవక్తలు బి) చివరి రోజులలో అపహాసకులు వచ్చి సృష్టాది మొదలు ఇప్పటివరకు ఇట్లేయున్నది గనుక రాకడ ఇప్పుడని యెట్లు చెప్పగలమని అనువారు అబద్ధ ప్రవక్తలు సి) రాకడ సమీపముగా లేదని గురుతులు జరిగిన తరువాత కూడా ఎవరు అందురో వారే అబద్ధ ప్రవక్తలు డి) రాకడను గురించి బోధించువారిని చూచి, అది తప్పు అని యెవరు చెప్పుదురో వారే అబద్ధప్రవక్తలు. 13) కృపను లోకువ కట్టుట అనగానేమి? నాకు సిద్ధపడుట చాలా ఇష్టముగాని ఆటంకములున్నవి, నా ఆటంకములు ప్రభువు తొలగించి నన్ను రాకడలో తీసికొని వెళ్ళునని తలంచుదురు. దేవుడు కృప చొప్పున చేర్చుకొన్నను న్యాయమును బట్టి శిక్ష వచ్చును. రాకడకు ముందు మనిషి కృపాకాలములో నుండును. ప్రభువు అనేకమైన గడువులిచ్చును, ఈ గడువులు త్రోసివేసినట్లయిన న్యాయము దగ్గరకు వెళ్ళవలసి ఉండును. కృపలో గడువు ఇవ్వబడినది. ఆ గడువును వాడుకొనక పోయిన న్యాయము వచ్చి రావలసిన మహిమ తీసివేయును.



14) ముద్రలు, బూరలు శ్రమలు అయిన తర్వాత మహా భయంకర శ్రమలైన పాత్రల శ్రమలకు ముందు దేవుడు గొప్ప స్వరముతో ప్రజలారా నా తట్టు తిరగండి అనును. అనేక మంది తిరుగుదురు. అయితే ఆయనను యెరిగిన వారే కృపను లోకువ కట్టిన వారు కృపను ద్వేషించిన వారు. మారు మనస్సు లేనివారు వారి తల్లిదండ్రులను లోకువ కట్టువారు తమ పిల్లలే, బయటివారు కారు. ఇతరులైతే ఎదిరింతురు అలాగే దేవుని సంగతులు ఎరిగినవారే దేవుని లోకువ కట్టుదురు. నోవహు ఓడ మూయబడును. కృప ఆగిపోవును తప్పి పోయిన కుమారుడు తండ్రిని క్షమాపణ కోరుకొన్నాడు. విడిచి పెట్టవలసినవి విడిచిపెట్టినాడు. పూర్తిగా రావడము కుమారత్వమునకు సంబంధించినది. గనుక తండ్రి కుమారునిగా చేర్చుకొనెను. గాని దాసునిగా చేర్చుకొనలేదు. ఎవరైనను సిద్ధపడిన తర్వాతనే అయోగ్యుడను అనిన బాగుండును గాని సిద్ధపడక ముందు అనుట బాగుండదు.

## రాకడ ప్రార్థనలు

(రాకడ ప్రార్థనలు - ప్రత్యేకమైన ప్రాముఖ్యమైన ప్రార్థనలు)

### మైదాన బోధకులకొరకైన ప్రార్థనలు

ఎ) త్రియేక దేవుడవైన తండ్రీ! యేసుప్రభువా మా మొదటి ప్రార్థన బోధకులను పంపించుము. భూదిగంతముల వరకు నీ సువార్త ప్రకటింప వలెను. (మార్కు 16:15) కాబట్టి నమ్మకమైన సొంత పని వారిని అనేక మందిని లేవనెత్తుము. ఇప్పుడున్న పని కొంతవరకు బాగుగాయున్నప్పటికిని కొంతవరకు మందముగా ఉన్నది కాబట్టి చురుకుదనముగా పనిచేసే బోధకులను, స్త్రీలను పురుషులను పంపించుము. అన్ని దేశములకు పంపించుము. ఓ ప్రభువా! కోత విస్తారము పనివారు తక్కువ అని తండ్రిని వేడుకొనండి ఆయన పంపును అని సెలవిచ్చినావు. (లూకా 10:2) కాబట్టి ఆ వాక్యమును బట్టి అడుగుచున్నాము. ఎప్పటికప్పుడే క్రొత్తది అడగండి అని చెప్పినావు. (మత్తయి 7:7) ఇప్పుడు అడుగుచున్నాము, పని పూర్తి

అయ్యేవరకు అడుగుచునేయుందుము. నీకు వందనములు ఇచ్చేవాడవు పనివారిని పంపేవాడవు గనుక అడగండి. వేడుకొనండి అని చెప్పియున్నావు. అందుకే వేడుకొనుచున్నాము.

బి) సమర్పణచేసి కేవలము నీమీదే ఆనుకొనియుండే పని వారిని పంపుము. సొంతాలోచన కాక వ్యాఖ్యానము కాక, ఇతరుల ఆలోచన కాక నీ యాత్మ అందించు వర్తమానమే (మత్తయి 10:19) సర్వజనులకందించే ప్రముఖులైన బోధలకును పంపించుము. ఇప్పుడు పనిమీదనున్న బోధకులను అట్టి బోధకులనుగా మార్చుచునే యుండుము.

సి) పనివారి యొక్క బలహీనతలు నీ అమూల్య రక్తము వల్ల శుభ్రము చేయుచు ఒక దరినుండి శుద్ధిచేయుచు మరియొక దరినుండి బలము కలిగించుచుండుమని నిన్ను వేడుకొనుచున్నాము (1యోహాను 1:7)

డి) ఇప్పుడున్న పనివారు యే పద్ధతుల మీద ఏ సాధనముల మీద, ఏ సాధనముల మూలముగా పనిచేయుచున్నారో ఆ పద్ధతులను, ఆ సాధనములను దీవించుమని వేడుకొంటున్నాము. మా మనవులు ఆలకించెదవని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

ఇ) ఇప్పుడు బోధకులు చేయుచున్నది గొప్పపని, అద్భుతకరమైనపని, బైబిలు గ్రంథమును వెయ్యి భాషలకంటే ఎక్కువ భాషలలోనికి తర్జుమా చేయుటయే అది నీ ఆత్మయొక్క పని. పెంతెకోస్తు దినమున నీ శిష్యులు అనేక భాషలలో సువార్తను బోధించిరి. ఇప్పుడు నీ బోధకులు అప్పుడు మాట్లాడిన భాషలకంటే యెక్కువ భాషలలో మాట్లాడుచు సువార్త ప్రకటించుచున్నారు. కాబట్టి నీకు స్తోత్రములు. ఆ పని యింకను వృద్ధిలోనికి వచ్చునట్లు మార్చుము. చిన్న చిన్న భాషలున్నవి. వాటిని నేర్చుకొనుచు వాటిలో కూడా నీ వాక్యము అచ్చువేయించుటకు పూనుకొన్న నీ పనివారిని నీ ఆత్మచే వెలిగించుచు వారిని వారి పనిని దీవించుము.

యఫ్) ఓ ప్రభువా! ఇశ్రాయేలీయులు అనేక సంవత్సరములు క్రిందట



చెదరిపోగా వారినిప్పుడు వాగ్దాన దేశమునకు చేర్చుచున్నందుకు వందనములు. అలాగుననే బాబేలు గోపురమప్పుడు చెదరిపోయిన వారినందరిని నీ మందలోనికి చేర్చునట్లు బోధకులను ప్రేరేపింపుము. మా ప్రార్థన యావత్తు రెండవ రాకడకు సంఘమును సిద్ధపర్చునట్లు పనిచేయగల బోధకులను పిలువుము. ఎందుకనగా అనేకమంది బోధకులు నీ రాకడ నిజమని నమ్ముచున్నారు. గాని త్వరగా వచ్చుచున్నావని నమ్ముటలేదు గనుక ఆ బోధకులకు నీవే బోధకుడవై యుండి త్వరగా వచ్చుచున్నానని బోధపర్చుము.

జి) ఓ యేసుప్రభువా! నీ శిష్యులను భూదిగంతముల వరకు సువార్త ప్రకటించేటందుకు సిద్ధపరచినావు. (మార్కు 16:15) కనుక అలాగే నేటి కాల బోధకులు రాకడకొరకు సంఘమును సిద్ధపరచునట్లు పంపుమని వేడుకొనుచున్నాము. నేటి ప్రార్థన విందువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము. అట్టి బోధ నీ రాకడ బోధ.

హెచ్) ఈ గదిలో నున్న మేము కూడ తీవ్రముగా బోధించుటకై బలహీనులమైన మాకు బలము, జ్ఞానహీనులమైన మాకు జ్ఞానము చురుకుదనము లేని మాకు చురుకుదనము, సమయములేని మాకు వీలైన సమయము దయచేయుమని వేడుకొనుచున్నాము.

ఐ) మా ప్రార్థన లోకమంతటిలో ఆయా స్థలములయందు పనిచేయుచున్న పాత బోధకులను గురించియు, క్రొత్త బోధకులను గురించియునై యున్నది. ఈ రెండు రకములైన బోధకులు ప్రజలకు సరిపోయేవారై యుండేటట్లు బోధకులను సరిచేయుమని వేడుకొనుచున్నాము.

జె) కృపగల తండ్రీ! నీకు స్తోత్రము కొందరికి రాకడ వర్తమానము తెలిసినను అందచేయుటలేదు చెప్పే వాక్కు నచ్చచెప్పే వాక్కు ఖండించే వాక్కు బోధపర్చే వాక్కు, ప్రత్యక్షపర్చే వాక్కు లేదు సజ్జనులైనప్పటికి వాక్కు లేదు. వారికి వాక్కు దయచేయుమని వేడుకొనుచున్నాము.

కె) ఓ ప్రభువా! బోధకులు లేనిదే ఎవరు ప్రకటించెదరు. ఒకవేళ

ప్రకటించినను అది హృదయమునకు అందదు నేను బాగుగా బోధించగలను యని అనుకొనేవారు కూడా బోధించలేరు. గనుక ఉన్నది ఉన్నట్లు పూసగ్రుచ్చినట్లు చెప్పగల బోధకులను సిద్ధపర్చుమని వేడుకొనుచున్నాము.

యల్) దయగల తండ్రీ! బోధకులు బోధకులుగాను మాత్రమే ఉంటే ప్రజలు ఆనందింపరు బోధప్రకారము నడుచుచు బోధిస్తూయుంటే వినెదరు, నీ వైపు తిరుగుదురు. బోధ ఒక మూల ప్రవర్తన యింకొక మూలనువుంటే ఎవరు వింటారు కాబట్టి రెండు సమానముగా యేర్పరచుకొనే బోధకులను సిద్ధపర్చుము. మంచి ప్రవర్తన గల క్రైస్తవులు మాత్రమే కాదు మంచి బోధలు చేసే క్రైస్తవులు కూడా అవసరమైయున్నది. అధికారుల వల్ల యేర్పాట్లు చేయబడిన బోధకులు కాక రహస్యముగా నీ వల్ల యేర్పర్చబడిన బోధకులు కూడా వెలిపలికి వచ్చి వెలుపలనున్నవారిని లోపలికి తీసుకొనివచ్చేటట్లు వారిని ఆకర్షించుమని వేడుకొనుచున్నాము. (ఆది. 19:16) నీ కృపకు అనేక స్తోత్రములు, వినువాడవు గనుక యెన్ని మనవులైనను చేసికొంటాము బోధకులు గురించి చేసిన ఈ మా ప్రార్ధన తక్కినవారి ప్రార్ధనలతో పాటు మహిమ సింహాసనము దగ్గరకు చేర్చుకొనుము ఆమెన్.

## 2. రహస్య సన్యాసుల కొరకైన ప్రార్ధన

దయగల యేసుప్రభువా! పరలోకములో అనగా దేవదూతల లోకములో మోక్షలోకములో, వాయుమండల లోకములో, భూలోకములో, పాతాళలోకములో, ప్రతివారి జీవితము నీ చేతిలోయున్నది. మృతుల యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు నీచేతిలోయున్నవి అని ప్రకటన వ్రాసిన యోహానుతో చెప్పినావు (ప్రకటన 1:18) పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారమియ్యబడి యున్నదన్నావు. (మత్తయి 28:18) కాబట్టి గుహలలోయున్న రహస్య సన్యాసుల నివాసుల మీదను, గృహ నివాసుల మీదకూడ నీ దృష్టి అధికారమున్నది గనుక వారిని బయటికి తీసుకొని రమ్మని వేడుకొనుచున్నాము. ఒక పొలములో కొంతమంది పనిచేయుచుంటే



ముగింపు చేయనందున రైతు మరికొంతమంది పనివారిని పెట్టును. అలాగు ననే ప్రభువా మైదానములలో పనిచేయుచున్న బోధకులు పూర్తిపని చేయలేక పోవుచున్నారు. గనుక పూర్తిపని చేయుటకు మాత్రమే గాక బోధకులకు ఉద్రేకము పుట్టించుటకును మారుమూలలోనున్న రక్షితులను బయటికి లాగుకొని వచ్చి మీరుకూడ బోధపని చేయండని వీధులలో నిలబెట్టుటకును ఆ రహస్య సన్యాసులను పంపుము అని వేడుకొనుచున్నాము. మా సహాయము కొరకు పంపుమని వేడుకొనుచున్నాము. నావలోనున్న వారు వలలాగలేక యున్నప్పుడు తోటివారిని పిలిచినారు గదా? (లూకా 5:7) వారు వచ్చినప్పుడు లాగే పని పూర్తియైనది అలాగే యిప్పుడు మేము నీ సువార్త వల్ల భూలోకమంతట వల వేసియున్నాము. లాగుటకై రహస్య సన్యాసులను పంపుమని వేడుకొనుచున్నాము. నీకు స్తోత్రములు. మైదాన బోధకులమైన మేము కొద్దిగా బోధచేయుచున్నాము. ఎప్పుడో ఒక పర్యాయము నీ సన్నిధిలో కూడుకొను చున్నాము అది చాలదు. బోధపని చాలదు. మేము చేయుపని అసలే చాలదు. సన్నిధాన వర్తులను యితరులు ఆక్షేపించుచున్నారు. సోమరులు పనిలేక గదులలో కూర్చుండి అరచుచున్నారని అనేక పేర్లు పెట్టుచున్నారు గాని గుహలలోనున్న రహస్య సన్యాసులకు ఎవ్వరు పేర్లుపెట్టలేరు. వారు నిత్యసన్నిధానవర్తులు గనుక జీవిత కాలమంతయు సన్నిధిలోనే యున్నారు. ఎంత గొప్ప ధన్యత! నెలకొక పర్యాయము మేమిక్కడ కూడుకొంటే అధమపక్షము ఒక క్రొత్త సంగతియైన నేర్చుకొనగలము. అయితే వారు రోజు క్రొత్త సంగతులను నేర్చుకొను చున్నారు. ప్రతిదినము నీ సన్నిధిలో వారుంటున్నారు మాలో యెవ్వరు అలాగున్నవారులేరు. మా కంటే వారు గొప్ప వారు. మరియమ్మ కొన్ని నిమిషములు మాత్రమే కొంతసేపు మాత్రమే నీ పాదసన్నిధి యందు కూర్చుండెను. (లూకా 10:30) అయితే వీరు సంవత్సరాల తరబడి నీ సన్నిధిలో కూర్చుంటున్నారు. మేమెవ్వరమైన వారి దగ్గరకు వెళ్ళవలెనంటే చలిచేత చచ్చిపోవుదుము. వారైతే రాగలరు మహిమతో

నింపబడియున్నారు. చలికి ఓర్చుకొనగలరు ప్రతి వారి యొక్క హృదయమును బ్రద్దలు కొట్టగలరు. ఎదిరించే నోళ్ళను కట్టివేయగలరు. బిగించగలరు కాబట్టి వారిని త్వరలో పంపుమని వేడుకొనుచున్నాము. స్తోత్రములు మీరు చెప్పినట్లయితే వారు రాగలరు. మేము వెళ్ళి మాట్లాడితే యెండాక నిద్రమత్తులైయుంటారు, రాకడ సమీపము. ఈ పాటికైన లెండి అని మమ్మును గద్దించెదరు. ఓడ నావికుడు ఓడయొక్క అడుగు భాగమున నిద్రపోవుచున్న యోనా ప్రవక్తను లేపినట్లు మైదాన బోధకులను లేపగలరు. (యోనా 1:6) కాబట్టి వారిని త్వరగా పంపించుమని వేడుకొంటున్నాము. నీకు స్తోత్రములు పొలము విస్తారము, బోధకులు తక్కువయని నీవు చెప్పినప్పుడు సన్యాసులున్నట్లు యెక్కడ వ్రాయబడ లేదు గాని క్రైస్తవ శకములో మాత్రమున్నట్లు సంఘ చరిత్రవల్ల కనబడు చున్నది. వారు గొప్ప పని చేస్తున్నారు నీకు స్తోత్రములు. మన అందరి కొరకు విజ్ఞాపన ప్రార్ధనలు చేయుచున్నారు. సన్నిధిలో యుండేవారు యుంటున్నారు. నిలకడలో యుంటున్నారు. మావలె మీటింగు మధ్య మధ్యను బయటికి వెళ్ళువారు కారు, స్థిరముగా నీ సన్నిధిలో ఉండేవారు. అది రెండవ పని. మూడవ పని ఏమనిన నీవు యేమి చెప్పితే అది వినేవారు మైదాన బోధకులు యేమి చెప్పగలరు. ఒకవేళ చెప్పిన యెడల యెంతమంది వినగలరు. వారైతే విసుగుదల లేకుండ నీవు చెప్పు మాటలు వినుచున్నారు. వారికి ఎంత ధన్యత 1) సన్నిధిలో యుండే భాగ్యము 2) చలికి సహించే భాగ్యము 3) మా ఆహారము అక్కరలేని భాగ్యము 4) వాక్యము వినే భాగ్యము 5) నీ మహిమ అనుభవించే భాగ్యము 6) ముఖాముఖిగా నిన్ను చూచే భాగ్యము 7) మా అందరి కొరకు విజ్ఞాపనలు చేసే భాగ్యము. ఈ ఏడు భాగ్యములు కలిగియున్న రహస్య ఋషులను మా మైదానముల మీదికి పంపుమని వేడుకొను చున్నాము. ఇదివరకు ఈ కూటములో వారిని గురించి ప్రార్ధించినాము. ఆ ప్రార్ధనల గొలుసు తెగిపోయినది. మరల ప్రారంభించు చున్నాము. 1889వ సంవత్సరమున పుట్టిన సాధుసుందర సింగు ఈ ప్రాంతములకు 1929



సం॥రం బోధకుడుగా వచ్చి ఆయన చలిని సహించగలిగాడు. గనుక ఆయన వెళ్ళి వారిని చూచి బైటికి వచ్చివేయండి అని చెప్పగా వస్తాం వస్తాం అని చెప్పిరి. యింకా రాలేదు. సుందర సింగు చెప్పడము కాదు, యేసుప్రభువా నీవే చెప్పుము ఆపైన మేము కోరుకొనవలెను. వలలాగలేనివారు కోరుకొంటే పాలివారు రాలేదా? (లూకా 5:7) అలాగే క్రైస్తవ బోధకులు నిన్ను కోరుకొంటే వారితో చెప్పి రప్పింపగలవు మా దగ్గరినుండి వారి రాకడ విషయమైన దరఖాస్తు నీ దగ్గరకు రావలెను గదా! ఎంతమంది ప్రార్ధించుచున్నారు. తెలిసిన మేమే ప్రార్ధించుటలేదు. యిప్పుడు చేసి మరలా ఒక సంవత్సరము వరకు ఆ తలంపు యుండదు. అలాగైతే వారెట్లు రాగలరు, మైదాన బోధకులు కోరుకొనవలెను. ఆ కోరికను ప్రభువా నెరవేర్చుము. ప్రభువా! భూలోక సంఘము వారి రాకడ కొరకు ప్రార్ధించునట్లు ప్రేరేపింపుమని వేడుకొను చున్నాము స్తోత్రములు. ఒక సంగతి జరుగును. వారు వస్తే దేశాలలో, పట్టణములలో, పల్లెల్లో గొప్ప అల్లరి ఆందోళన కలుగును. కలిగితే కలిగింది గాని వారిని త్వరలో రప్పింపుము.

యువరాజుగా రానైయున్న యేసుప్రభువా! పెండ్లి కుమారుడవుగా రానైయున్న యేసుప్రభువా నీకు స్తోత్రములు. ఈ సన్యాసుల గుంపునకు పెద్దగానున్న కైలాస ఋషిగారి సంగతులు కూడా మాకు తెలియపరచు చుండుమని వేడుకొనుచున్నాము. మా దేశములో యొక గొప్ప మహాఋషిని లేపియున్నావు. మా దేశమునకు యితర మతస్తులు ఋషుల దేశమని పేరు పెట్టియున్నారు. అట్టి దేశములోని అనుచరులలో యొకరిని లేపినందుకు నీకనేక స్తోత్రములు. మా దేశములో యెక్కువగా నీ సన్నిధిలోయున్న సుందర సింగును రప్పించిన నీకనేక వందనములు. ఆయనకు ఋషికిని స్నేహము కలిపిన నీకు స్తోత్రములు. ఆయన ద్వారా ఆయన పుస్తకముల ద్వారా ఆయన యుపన్యాసముల యొక్క వర్తమానముల ద్వారా మా దేశమునకు రెండవ రాకడ బోధ యింకను విరివిగా వినిపించు చుండుమని వేడుకొనుచున్నాము.

రహస్యసన్యాసులు ధ్యానములోయుండగా పరలోక వాస్తవ్యుల విషయములు, దేవదూతల విషయములు మా విషయములు ఆయనకు తెలియుచున్నవి. అట్టి గొప్ప వానిని హిమాలయ పర్వతములలో ఒకరిని లేపియున్నావు గనుక నీకు స్తోత్రములు.

ఒకరు మహమ్మదీయ దేశమునకు సంబంధించిన వారు, ఇంకొకరు మా దేశమునకు సంబంధించినవారు, ఇద్దరిని మా దేశములోనే లేపినావు వీరు కూడా సన్యాసులే వారు రహస్య సన్యాసులు, సుందర సింగు బహిరంగ సన్యాసి, వీరి ద్వారా వర్తమానములు వినిపించినావు ఇప్పుడు వర్తమానములు దొరకడము లేదు వాటి ఫలితము యిప్పుడు చూపింపుమని వేడుకొనుచున్నాము నీకనేక స్తోత్రములు. ఆమెన్.

## 3. మృతుల కొరకైన ప్రార్థన

యేసుప్రభువా నీవు ఈ లోకములో నున్నప్పుడు (మత్తయి 9:26) ఒకరిని యింటిలో, ఒకరిని బైట, ఒకరిని సమాధి దొడ్డిలో బ్రతికించినావు. యోహాను 11:44 ఇంట్లో యాయీరు కుమార్తెను, బయట నాయీను విధవరాలి కుమారుని, సమాధిలో నీ స్నేహితుడైన లాజరును లేపినావు. యాయీరు కుమార్తెను బ్రతికించుమని యొకమనవియున్నది, లాజరును కూడా బ్రతికించుమని యొక విధముగా మనవియున్నది. వారిద్దరిని బ్రతికించినావు నాయీను విధవరాలి కుమారుని గురించి మనవి లేదు. అయినను బ్రతికించినావు. అప్పుడు మొదట రాకడలో మృతులను బ్రతికించుట వల్ల ప్రజలకు నీవు యెటువంటి వాడవో అనే వర్తమానమిచ్చినావు. కాబట్టి అడిగిన అడగకపోయిన కొంతమంది భక్తులను బ్రతికించుమని వేడుకొనుచున్నాము. వారు వచ్చి ప్రభువు రాకడను గురించి చెప్పగలరు. దేశానికి యొకరు బ్రతికివస్తేచాలు అప్పుడు వారు కొంతమందిని నమ్మించగలరు. నీ పునరుత్థానమును అందరు నమ్మలేదు. కొంతమంది నమ్మినారు, అందరు నమ్మకపోయిన అందరువింటారు. అవి వినాలని మేము కోరుకొంటు



న్నాము. గనుక మృతులను బ్రతికింపుమని కోరుకునే వర్తమానము (మత్తయి 10:8) నీ వాక్యానుసార విషయమే గాని మా సొంతము కాదు. వాక్యములో యున్నది గనుక మేమడుగుచున్నాము నీవు నీ శిష్యులకు ఒకమాట చెప్పినావు రోగులను స్వస్థతపరచండి, (మత్తయి 10వ అధ్యా.) అక్కడ ఆగలేదు వెంటనే యింకొక మాట అన్నావు మృతులను లేపండి అన్నావు (మత్తయి 10:8) నీ శిష్యులు అలాగు లేపినారు. దోర్కాను పేతురు లేపినాడు. (అపో.కా. 9:41) కాబట్టి నీవు వచ్చి కొంతమందిని లేపితే నీవు చెప్పిన వర్తమానమే వారు సిద్ధపర్చుకొందురు. నీ మరణ సమయమందు పరిశుద్ధ మనుష్యులు లేచివచ్చినారు గదా (మత్తయి 27:52) అందరికి కనబడినారు. (మత్తయి 7:53) ఇప్పుడు కూడ అందరికి కనబడినారు (మత్తయి 7:53) ఇప్పుడు కూడా అందరిని లేపడములేదు నీవు అనుకొన్నవారినే లేపినావు, అలాగే నీవు అనుకొన్నవారినే లేపుము, మేము పేర్లు చెప్పుట యెందుకు మృతులు వచ్చినప్పటికిని నమ్మనే నమ్మరుయని అబ్రహాము ధనవంతునితో చెప్పెను. (లూకా 16:31) ఆ మాట చెప్పిన తరువాత నీవు లేచినావు దోర్కాలేచినది. మృతులు లేచి చెప్పినా నమ్మరని చెప్పిన తర్వాత నీవు లేచినావు. దోర్కాను లేపినావు కనుక ఆ మాట తర్వాత వచ్చిన ఈమా కాలములో కూడా కొంతమందిని లేపుము. అయితే యేసుప్రభువా నీవు లోకానికి రాకముందు కూడా లేపినావు ఎలీషా కాలములో లేపినావు గదా! (2రాజులు 4:37) గనుక పాతనిబంధన కాలములో క్రొత్తనిబంధన కాలములో మృతులను లేపినావు యనేదియున్నది గనుక యిప్పుడు ఏమడుగుచున్నాము. ఇది సంఘకాలము త్రియేకదేవుడవైన ఓ తండ్రీ! పాతనిబంధన కాలములో, క్రొత్తనిబంధన కాలములో సంఘ కాలములో నీకు మిక్కిలి ప్రియమైన సంఘకాలములో, నీకు మిక్కిలి ప్రియమైన వధువు సంఘకాలములో ఈ మూడు కాలములలో నీవు మృతులను లేపగలవని నమ్ముచున్నాము ఒకప్పుడు నీకు సాధ్యమైనది యిప్పుడు కూడా సాధ్యమే. త్రియేకదేవా! త్రికాలములో

నీ మహిమను చూపించుము గతించిన రెండు కాలములలో మహిమ ఈ మూడవకాలములో యున్న మాకు జ్ఞాపకము చేయడమువల్ల నీ ప్రభావము కనపర్చుమని త్రియేక దేవా నిన్ను వేడుకొనుచున్నాము. ఈ ఉదయమున, ఈ మధ్యాహ్నమున చేసిన ఈ ప్రార్థనలు నీ వాక్య చరిత్రను బట్టి యిప్పుడు రానైయున్న ప్రభువు ద్వారా ఆలకించుము. ఆమెన్.

## 4. దేవదూతల కొరకైన ప్రార్థన

యేసుప్రభువా! మేము రక్షణ స్వాస్థ్యము పొందవలసిన వారమైయుండగా మాకు పరిచర్య చేసే దేవదూతలను యేర్పరచినావు. (హెబ్రీ 1:14) ఆ సమూహములో కొందరిని భూలోకములకు పంపుమని వేడుకొనుచున్నాము. ఈ సంగతి నీ వాక్యానుసారము కాబట్టి అడుగుచున్నాము. వాక్యములో లేనిది అడగలేము భూమిమీదయున్న రెండు గుంపులవారు మనుష్యులే. అట్టి మనుష్యులను పనివారిగా పంప వేడుకోమని నీ వాక్యములో యున్నది. అందుచేత అడిగెదము, అలాగే దేవదూత కూడా నీవు ఈ లోకమునకు పంపినావని నీ వాక్యములోయున్నది. గనుక అడుగుచున్నాము. సొదొమా పట్టణమె మనకు నాశనకరమైన తీర్పు వినిపించుటకై మనుష్య రూపములో దేవదూతలిద్దరిని పంపినావు గనుక రాకడ సమీపమందు యిప్పుడు కూడా పంపుమని వేడుకొనుచున్నాము. (ఆది. 19 అధ్యా.) కొర్నేలి ప్రార్థించినపుడు దేవదూతను పంపినావు ఆయన వర్తమానము యిచ్చినాడు. నీ ధర్మకార్యములు చేరినవి. పేతురు కొరకు పంపుమని చెప్పెను (అపో.కా. 10 అధ్యా.) మనిషి మాట్లాడినట్లె మాట్లాడెను. అప్పుడు దేవదూతలను పంపిన నీవు యిప్పుడెందుకు పంపకూడదు. దేవదూతలు ఆకారము లేనివారు (మత్తయి 28:3) అయినప్పటికిని ఒక దేవదూత నిద్రమీదయున్న పేతురును కొట్టి లేవనెత్తి పంపెను. (అపో.కా. 12:7) మన చేతితో తట్టినట్లు తట్టెను. అది అసాధ్యమైన సంగతి చేతులుంటే వారు కొట్టగలరు మన చేతులవంటి చేతులు లేనివారు ఎట్లు తట్టగలరు. ఆయన పేతురును బయటికి నడిపించుకొని



వెళ్ళినాడా? లేదా? (అపో.కా. 12:7-10) అలాగే యిప్పుడు కూడ ఒక్కొక్క దేశమునకు ఒక్కొక్క దేవదూతలను పంపి రాకడ వర్తమానము వినిపింపుమని వేడుకొనుచున్నాము. నీ మొదటి రాకడలో దేవదూత మనిషి మాట్లాడినట్లు మాట్లాడి వర్తమానము చెప్పినది రక్షకుడు పుట్టినాడని మహా సంతోషకరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నానని చెప్పినది. (లూకా 2:11) అలాగైతే దేవదూతలను లోకమునకు యిప్పుడు యెందుకు పంపకూడదు మొదటి రాకడ సమయములో దేవదూతను పంపిన నీవు రెండవ రాకడ సమయములో దేవదూతను పంపిన యెడల కొంతమంది నమ్మగలరు. రాత్రులు కాదు పట్టపగలు ఎండవేళప్పుడు అబ్రహాము డేరా యొద్ద యుండగా ముగ్గురు దేవదూతలను పంపినావుగదా! వారు మాట్లాడినారు, మనిషి రూపములో కనబడినారు. భోజనము చేసినారు, ఎంత ఆశ్చర్యము, అట్టి దేవదూతలను ఈ రాకడ కాలమందు పంపించిన కొద్దిమందియైనా నమ్మగలరు. (ఆది. 18:1-15) మనుష్యులలో పనివారు తక్కువ దేవదూతలలో కోటానుకోట్లు పనివారున్నారు ఒక కోటి దేవదూతలను పంపిన లోకమంతట ఆవరింపగల మైదాన బోధకుల కంటే గుహవాసుల కంటే వారు యింకా యెక్కువ ధాటిగా పనిచేయగలరు. ప్రభువా నీ దూతలు కూడా మా పరిచారకులను పంపించుమని అనుటకు మాకు హక్కు యున్నది. (హెబ్రీ 1:14) ఓ తండ్రీ! మరియొక సంగతి, గొప్ప సంగతి, అంతటి స్నేహితులు మాకు లోకములో ఎక్కడనులేరు. అంతటి కావలిబంటును ఎక్కడను లేరు (దా.కీ. 34:7) మా రక్షణను గూర్చి యెల్లప్పుడు ఆలోచించుచు మాకు సహాయము చేయుటకు సిద్ధముగా నున్నవారు తప్ప వారంత శ్రద్ధగలవారు యింకెవరును లేరు. అంత శక్తిగలవారు లేరు. ప్రభువా నీవు జన్మించినప్పుడు వర్తమానము మనుష్యులు తీసుకొని రాలేదు. దేవదూతలు తీసికొనివచ్చినారు. ఎందుకంటే పరిశుద్ధ దేవకుమారుని పరిశుద్ధ జన్మమును గూర్చిన పరిశుద్ధ వర్తమానము మోయుటకు మనుష్యులలోని, పరిశుద్ధులు

కూడా యోగ్యులు కారు అందుచేతనే దేవదూత వర్తమానము తెచ్చెను. ఆ కాలములో భక్తులు లేకపోలేదు గాని యీ వర్తమానమందించుటకు వారు తగరు. ప్రభువా రాకడ వర్తమానము అందించుటకు మేము యేపాటివారము మాకు బోధపడదు. అందుచేత మొదటి రాకడ దూతలను పంపి వినిపించు నట్లును (లూకా 2:14) యీ రెండవ రాకకు కూడా దేవదూతలను పంపి వర్తమానము వినిపించిన మాకెంతో సంతోషము. అట్టి సంతోషము కలిగించు దువని నమ్మి నీకు హృదయపూర్వక వందనములు చెల్లించుచున్నాము ఆమెన్.

## 5. ప్రభువు రాకకొరకైన ప్రార్థన

యేసుప్రభువా! 1845 సం॥లో ఆఫ్రికాలో ఒక వృద్ధురాలికి నీవు కనబడి నేను త్వరగా వచ్చుచున్నానని చెప్పియున్నావట. మనిషి చెప్పలేదు. తన మనస్సు చెప్పలేదు ఆ రీతిగానే అప్పటివలెనే యిప్పుడు కూడా నీవు స్వయముగా వచ్చి కొంతమందికి చెప్పుమని వేడుకొనుచున్నాము. ఉదా: రైతుకూలీలు సరిగా పనిచేయనప్పుడు తానే నడుము బిగించుకొని స్వయముగా పనిచేయును గదా! ప్రభువా నీవు దేవుడవు మనుష్యుడవు కాబట్టి నీవే స్వయముగా వచ్చి చెప్పుమని వేడుకొనుచున్నాము. ఇదికూడా వాక్యానుసారమే. కైలాషఋషితో సన్యాసులతో, సుందరసింగుగారితో, బరంపురంలోని స్త్రీల సమాజముతో, దేవదాసయ్యగారితో నేను త్వరగా వచ్చుచున్నానని చెప్పియున్నావు. అలాగే ఆయా వారికి నీవే స్వయముగా వెళ్ళి మా పనిని పూర్తిచేయుము.

మేము చెప్పిన యెడల వారు అడుగుచున్నారు. మీకు ప్రభువు కనబడినారా? యని అడుగుచున్నారు. ఔను అని చెప్పినయెడల అదేమి పక్షపాతము మాకెందుకు కనబడకూడదు, మాకు కనబడినపుడు మేము కూడ నమ్మెదము అని కొందరడుగు మాటలు పలుకుచున్నారు. అట్టివారికి బుద్ధి చెప్పుటకు కూడ నీవే స్వయముగా కనబడి మాటలాడుమని వేడుకొను చున్నాము. (మార్కు 16:14; మత్తయి 5:8) ఈ ప్రార్థన వాక్యానుసారమే



ఎందుచేతనంటే ఇదిగో త్వరగా వచ్చుచున్నాననేమాట వ్రాయించినట్లు (ప్రకటన 22:16) యిప్పుడు కొంతమందితో ఆ మాటే చెప్పుచున్నావు కొందరితో ప్రభువా నీవు అందరి రక్షకుడవు గనుక అందరితోను చెప్పుమని వేడుకొనుచున్నాము (ఎఫెసీ 4:6) ఆమెన్.

షరా: దేవదూతలను గాని దేవుడు పంపించిన యెడల ఒక్కొక్క దేశమునకు ఒక్కొక్క దేవదూతను పటాలములుగా నిలువబెట్టితే ఆ క్రిస్మస్ వర్తమానము చెప్పినంతకాలములో చెప్పిముగించగలరు. జపానులో ఒక దూత అమెరికాలో ఒకదూత అలాగే అందరు యేకకాలములో ఒకేసారి రాగలరు, చెప్పగలరు, వెళ్ళగలరు. చెప్పడము మట్టుకే అలాగే యేసుప్రభువా! అన్ని దేశములలోనున్న ఒక్కొక్కరి దగ్గరకు యేకకాలమందు ఒక నిమిషముండగలవు. 600 కోట్లమంది వద్ద 600 మంది క్రైస్తవులుగా కనిపించగలరు, చెప్పగలరు. దూతలైతే యెక్కడయితే అక్కడే చెప్పగలరు. మృతులైతే ఎక్కడయితే అక్కడ చెప్పగలరు. వీలైతే అందరికి యేకకాలమందే చెప్పగలవు. ఎంతసేపు పట్టునంటే యిదిగో నేను త్వరగా వచ్చుచున్నాను అని బైబిలులో (ప్రకటన 22:16)లోయున్నది అని చెప్పడానికి ఎంతకాలము పట్టును అంతసమయములో ప్రభువా నీవు చెప్పగలవు. ప్రభువా మేము నీకు ఆలోచన చెప్పదగిన వారము కాకపోయినను నీ వాక్యమును బట్టి, నీ శక్తిని బట్టి, పరలోకమందున్న మా తండ్రీయని ప్రభువు ప్రార్థనలో నీవు మాకిచ్చిన చనువును బట్టి మేము నిన్ను అడగరాని ప్రశ్నలు అడిగినాము. అడగరాని మనవులు అడిగినాము. నీవు క్షమించెదవు మా ఉద్దేశ్యములలో తప్పులుండవచ్చును. వాటిని క్షమించెదవని నమ్మి నీకు వందనములు చెల్లించుచున్నాము. ఆమెన్.

## గమనిక

1. ఐదు ప్రార్థనలు అందరికి కాదు. ప్రభువుతో మిక్కిలి పరిచయముగల వారికి మాత్రమే.

2. ఇది అనుదిన ప్రార్థనే గాని మీలో యెవనికిని చేయుటకు శక్తిలేదు. చేయబోతే నామక ప్రార్థన వచ్చును.

3. ఆదివారము యెక్కువ సమయముండును గనుక మీలో ఒకరు అది నెమ్మదిగా చదివితే తక్కినవారు బహునెమ్మదిగా పలుకవలెను.

4. మహావినయముతో, భయముతో, సంకేతశాలలో యుండవలసిన భక్తితో, క్షమించు ప్రభువా యనే స్వరముతో నా ప్రార్థనవల్ల ప్రభువునకు యెక్కడ కష్టము కలుగునోయనే జాగరూకతతో వీలైతే కండ్లకు రుమాలు కట్టుకొని మనోనిదానముతో ప్రార్థింపవలెను.

5. ఈ ప్రార్థనలు పద్ధతులు గ్రహింపనివారు వస్తే ఈ ప్రార్థనలు మానవలెను.

6. ఈ ప్రార్థనలు చేయవలెనని యేర్పాటు చేసికొన్నప్పుడు కూటస్తులు ఒక్కొక్కరు మాట్లాడుకొని యితరులు రానివేళలో చేసికొనవలెను.

7. అప్పుడు చదవవలసిన పాఠము సైన్యములకు అధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది (యెషయా 6:3) ఇది కల్పించిన రమ్యరాగముతో పాడవలెను.

8. ప్రార్థన ఆరంభములో నాయకులు ఈ మాటలు చెప్పవలెను, అవేవనగా ఈ ప్రార్థనల యొక్క సూత్రములు అతిక్రమించువారికి యే హానియైనా కలిగితే నన్ను అడగవద్దు అని నాయకులు సమాజములో చెప్పవలెను.

9. తత్పూర్వమే స్నానముచేసి, రేవు బట్టలు లేదా ఉతికిన బట్టలు కట్టుకొని సంకేతశాలకు రావలెను.

10. సంకేతశాలలో యున్నప్పుడు ఒకరితో ఒకరు మాటలాడకూడదు.

11. బైటికి వెళ్ళకూడదు, దగ్గకూడదు తుమ్మకూడదు (ఇది అంత ఖండితము కాదు గాని భద్రముగా నుండవలెను)

12. ఒక గంటకంటే యెక్కువ యుండకూడదు.



13. మోకాళ్ళ మీదనే యుండవలెను.

14. శరీరము బైటగాని లోపట గాని యేవిధమైన అపవిత్రత యుండకూడదు.

15. వీలైతే ఉపవాసము (ఆ గంటకే)

16. ఉదా: మన యెదుట తండ్రి, కుమార, పరిశుద్ధాత్మయున్నట్లు ఊహింపవలెను. ఊహలోనికి ప్రధాన దూత పరిశుద్ధులు వచ్చినట్లుంటే పరవాలేదు.

షరా: 1. దీనికి ప్రత్యేకమైన గది. అల్లరులు వినబడని గదియుండిన మంచిది. 2) పెండ్లికుమార్తె వరుసలోని వారికి లవొదికయ సంఘస్థులకును యిది సుళువుగా కుదరగలదు. 3) నడిపించే వారు స్వయముగా ఒక్కరే ముందు ప్రాక్టీసు (తర్ఫీదు చేయకుండ యెవరికిని చెప్పకూడదు).

షరా: ప్రతి శుక్రవారం 12 గంటలకు రాకడ ప్రార్థన ఆదినమునకై సిద్ధపడు విధము.

1) తెల్లవారుజామున 3 గంటలకు లేచి దైవగ్రంథమును ఓపికయున్నంత వరకు కొన్ని అధ్యాయములు చదువవలెను.

2) పిమ్మట పనులన్నీ చేయవలెను.

3) తెల్లవారిన పిదప కుటుంబ ప్రార్థనలో రాకడ ప్రార్థనలు జ్ఞాపకముంచుకొని, కొన్ని అంశములు ఎత్తి రాకడను గూర్చి ప్రార్థించవలెను.

4) కుటుంబ ప్రార్థన అయిన పిదప నోరు, చెవి అన్ని అవయవములు బిగబట్టుకొనవలయును ఆదినమంతా ప్రత్యేకమైన సిద్ధబాటు కలిగియుండ వలెను.

5) ఐదు నిమిషములు తక్కువ 12 గం॥ అయినప్పుడు తల అంటుకొనరాదు. దువ్వెన వెదకరాదు.

6) పిల్లలను ధూషించరాదు.

7) మనసు ఆయాసముతో లోనికి రాకూడదు.

8) మెట్టు మెట్టునకు మనో స్తుతి కలిగియుండవలెను.

9) అప్పుడు దైవ సన్నిధిలో ప్రవేశింపవలెను.

షరా: ఆత్మతండ్రి వచ్చి మిమ్ములను పరీక్షచేయును, ఇది శుక్రవారము సిద్ధపాటు మిగతా వారములలో కూడా ఈ ఆచరణ అవలంభించిన మంచిదె. గొప్ప క్రమమైయున్నది. త్రోవను వచ్చేటప్పుడు కుక్క కరిస్తే ఛి ఛి అనకూడదు. యేసురక్తమునకు జయమనవలెను. త్రోవలో వచ్చేటప్పుడు యెవరైనా మాట్లాడితే కేవలము ఆ పరిశుద్ధాత్మ అనుగుణ్యమైన అంశములైయుండ వలెను. ఆయాసకరమైనవేవియైనను మాట్లాడకూడదు. పెండ్లికుమార్తెకు అవి తగవు. (ఇది ప్రభువు ప్రత్యేకముగా యిచ్చిన వర్తమానము) చిన్ని కన్నియ సన్నిధి కూటములు 10-6-60 విజయవాడ బైబిలుమిషను సంఘ సభ్యులు ప్రతి శుక్రవారము ఈ క్రమము ప్రకారముగా చేయుదురు. శుక్రవారము 12 గంటల నుండి 3 గంటల వరకు ఉపవాసముతో ఈ కార్యక్రమము జరిగించుచుందురు.

## రాకడ ప్రార్ధనలు

### 5-9-58 వారమునకు ఒక అద్భుతము

నమ్మిన నమ్మకపోయినా ప్రజలకు బోధించుమని యెహెజ్కేలుతో చెప్పినావు (యెహెజ్కేలు 3:1) దేవా! నీ రాకడ అందరికి చెప్పుము మరియు (యోహాను 24:14) ను ఆధారమును చేసికొని ప్రార్ధించుచున్నాము. ఇంకను బైబిలు మిషనును బైలుపర్చిన సంగతిని ఆధారము చేసికొని ప్రార్ధించు చున్నాము. మా ప్రార్ధన నెరవేర్పులు కొట్టివేయకుము, నీ శక్తికి మించిన ప్రార్ధన మేము చేయలేము, మా పొరబాట్లను అంతములేని నీ ప్రేమను బట్టి క్షమించుము.

1) నీవు డిక్టేషను చెప్పి యెవరిచేతనైనా రాకడ పత్రికను గురించి బైబిలు సొసైటీ వారికి పంపించుము. మరియు వారు 400 భాషలలో పేపరు అచ్చువేసి అమ్మే బైబిళ్ళలో పెట్టవలసినదని చెప్పుము. ఈ పని



మేము చేయుట నీకిష్టమైతేసరి.

2) ప్రతి భాషలోను నోటితో ప్రకటించుటకు కొంతమంది ఆత్మ గలవారికి మహిమ శరీరముతో సమానమైన శరీరము ఇచ్చి గాలిలో పంపించి చాటించుము ఆమెన్.

3) కొంతమంది నిద్రలో యున్నప్పుడు వారి యాత్మలను నీయిష్టము వచ్చిన వారి యొద్దకు పంపించి చెప్పించుము.

4) భక్తులలో కొందరు నీ మరణ దినమున లేచినారుగదా అట్లే మృతులను లేపి వారిచేత నియామక స్థలములలో నియామక సమయము చొప్పున చాటించునట్లు చేయుము.

5) లోకములోనున్న నీ భక్తులలో పర్వతవాసులు ఋషులు భక్తులను రప్పించి చెప్పించుము.

6) బ్రాడ్‌కాస్టులు ప్రతి పట్టణములో యేర్పరచి సువార్త చెప్పే బోధకులను నిలువబెట్టుము.

7) ఆకాశమునుండి గొప్పధ్వని లోకమంతటికి ఏకకాలమందు ఒక గంటయైనను వినబడునట్లు చేయుము.

8) లోకములో నీకిష్టములేని దేవాలయములు, ప్రార్ధనాలయాలు యెరికో గోడలు పడగొట్టినట్లు మనుష్యులు చావకుండ పడిపోజేయుము (యెహోషువా 6వ అధ్యాయము)

9) ప్రతి దేవాలయము మీద నీ రాకడ సంగ్రహ వర్తమానము గాలిలో వ్రాయించుము.

10) ఒక ప్రత్యేక దినమున లోకములోయున్న మృగములు పక్షులు, పశువులు, పగలు కట్టుకర్రలు విప్పుకొని వీధులలో రంకెలు వేయునట్లు చేయుము. అలాగే గొర్రెలు, మేకలు యితర జంతువులు కూడా.

11) ఒక ప్రత్యేక దినమందు ఆకాశపక్షులన్నియు ఒకరాత్రి అందరు మాటు మణిగిన తరువాత చెవులు గింగురుమనునంతగా ఎక్కువగా

కూసేటట్లు చేయుము.

12) ఒక ప్రత్యేక దినమందు కప్పలు, పాములు, జెర్రెలు, ఈగలు, దోమలు, తూనీగలు అన్ని విధములైన పురుగులు ఉదయమున ఎండ సమయములో రోడ్లమీద బాటలమీద నడిచి వెళ్ళిపోయేటట్లు చేయుము (ఎవరికి హానిచేయకుండ)

13) ఒక ప్రత్యేక దినమున లోకములోయున్న ఆసుపత్రి రోగులు, ఇంటిరోగులు, అకస్మాత్తుగా పగలు నడిచి బైటికి వచ్చి మరల యిండ్లకు వెళ్ళిపోవునట్లు చేయుము.

14) ఒక రోజు పగలు, రాత్రులు అపరిమితమైన వర్షము పిడుగులు, ఉరుములు కలిగించుము (నరులకు హానిరాకుండ)

15) మరియొక దినమున లోకములోనున్న నదులన్నియు గట్లమీదుగా పొంగి ప్రవహించునట్లు ఒక గంట మాత్రమే చేయుము (మనుష్యులకు హానిలేకుండ)

16) లోకములోనున్న చెరువులు నూతులు, పొరలిపోయేటట్లు చేయుము ఒక గంటమాత్రమే (మనుష్యులకు హానిలేకుండ)

17) లోకములోనున్న చెట్లన్నియు కిర్రున మోత పెట్టి నిన్ను స్తుతించునట్లు చేయుము.

18) ప్రతి గ్రామములోనున్న నేల పట్టపగలు ఒక గంట మనుష్యులకు హానిలేకుండా వణికేటట్లు చేయుము.

19) మరొకనాడు సూర్యుని ఒకగంట బహువేంద్రముగా ప్రకాశింపజేయుము (మనుష్యులకు హాని లేకుండా)

20) ఒకనాడు ఒకగంట భూమియందంతట మంచు కురిపింపజేయుము (మనుష్యులకు హానిలేకుండా)

21) ఒక రాత్రి ఆకాశము చిత్తుచిత్తుగా ఉల్కలు జారిపడునట్లు చేయుము (మనుష్యులకు హానిలేకుండా)



22) ఒకనాడు అన్ని సముద్రములు హద్దుదాటి ఒక ఫర్లాంగు పొర్లివచ్చునట్లు చేయుము (మనుష్యులకు హానిలేకుండా)

23) లోకములోయున్న దయ్యములన్నియు అందరికి తెలిసేటట్లు మధ్య రాత్రివేళ గొల్లున గోలపెట్టునట్లు చేయుము (ఒక గంట మాత్రమే)

24) ఎవరైనా యొకరిని పంపి నీ రాకయొక్క బొమ్మను కోట్లు కోట్లు అచ్చువేసి అన్ని దేశములలో యిచ్చేటట్లు చేయుము.

25) భక్తులతో ఆయాభాషలతో రాకడ కీర్తనలు కట్టించుము.

26) బైబిలు మిషనువారు ఆదిలో వాడుకొన్నట్లు యిప్పుడును రాకడ కీర్తనలు పాడుకొన్నట్లును, రాకడ వర్తమానములు యిచ్చేటందుకు బూరలు వాడుకొనేటట్లు ప్రేరేపించుము.

27) ఏయే మతములవారు ఏయే తప్పుడు సిద్ధాంతములు, ఏయే దురాచారములు కలిగియున్నారో వారందరికి స్వప్నములోనో దర్శనములోనో కనబడి వారితప్పులు దిద్దుము.

28) నీవిచ్చిన జ్ఞానమునకు, మనస్సాక్షికి, నీవే స్వయముగా బోధించుము. లేక భక్తులు చెప్పితే విన్న బోధలునచ్చేటట్లు చేయుము.

29) ఏమిటి గుర్తు? ఏమిటి మీ వింతలు? ఏమిటి యీ క్రైస్తవులు రాకడ రాకడ అంటున్నారు అని పత్రికవారు రాకడనిమిషము వరకు మనస్సులో మరువకుండ తలంచుకొనేటట్లు చేయుము.

30) ఎప్పుడైన ఒకసారి మృతులైనవారు తమ బంధువులకు కనబడి రాకడ విషయములు చెప్పేటట్లు చేయుము.

31) ఇప్పుడైన పరలోక దూతలందరు రాకడ వర్తమానములు మనుష్యులందరికి చెప్పేటట్లు చేయుము.

32) కాకానిలో దయ్యముపట్టిన మనుష్యులను అడిగితే యేసుప్రభువే రక్షకుడని చెప్పుచున్నారు అలాగే దయ్యములు కూడా తామున్న స్థలములలో నున్నవారికి నిన్ను గూర్చి చెప్పేటట్లు చేయుము (సాక్ష్యమిచ్చేటట్లు చేయుము)

33) బిలాము యొక్క గార్ధభము బిలామును గద్దించెను. అలాగే నీ వాక్యము విననివారియొక్క పశువులను వారిని గద్దించేటట్లు నియమింపుము. పశువులకు వాక్కుయిమ్ము (సంఖ్యా. 22:28)

34) దేవా! నీవు భూమిని, ఆకాశమును, వాటిలోని సమస్తమును, దేవదూతలను కలుగజేసినావుగదా యీ నీ సృష్టి అంతటిని అనగా సృష్టిలో ఉన్న చిన్న పెద్దవస్తువులను వాడుకొనుటకు యిదియే సమయము. సృష్టి ద్వారా మనిషికి వర్తమానము అందించుము అతని అనుచరులకు హడలు పుట్టించుము.

35) మొట్టమొదట యీ కూటములకు క్రమేణతక్కినకూటములకునూ మా అంశములు పంపేటందుకు సమయము శక్తి దయచేయుము.

36) లోకములో అనగా నీవు కలుగజేసిన పరిశుద్ధలోకములలో నేటివరకేది అపవిత్రముగా నున్నదో. అది ప్రతిమనిషికి జ్ఞాపకముచేసి మా పాపములవలననే గదా సాతానుకు లోబడుట, నీవు దేవునికి లోబడక పోవుటవల్లగదా యీ అపవిత్రత అని తెలిసికొని, బుద్ధితెచ్చుకొనేటట్లు గద్దించుము. అపవిత్రత అనగా పాపరోగము, బంద, బాడి మొదలైనవి.

37) ఓ ప్రభువా! మాకు చెప్పిన సంగతులే లోకములోనున్న వారికందరికి అనగా ముఖ్యముగా సన్నిధికూటస్థులకు చెప్పుము ఆమెన్.

38) దేవా! ఈ 38 అంశములలో నీకు యిష్టము వచ్చిన అంశములకు జవాబు యిమ్ము.

## 7. బైబిలు మిషనువారు రాకడ విశ్వాసులును చేయవలసిన ప్రమాణములు

సంఘారోహణమునకు సిద్ధపడుదునని త్రిత్వదేవుని యెదుటను పరిశు ద్ధులందరి యెదుట, దైవజనుని యెదుటను నేను ప్రమాణము చేయుచున్నాను.

2. సంఘారోహణము త్వరగా జరుగనైయున్నదని నమ్ముచు ప్రమాణము చేయుచున్నాము.



3. బైబిలుమిషను సిద్ధాంతములకు పూర్తిగా లోబడుదునని వాగ్దానము చేయుచు ప్రమాణము చేయుచున్నాను.

4) సంఘారోహణ వృద్ధికి ప్రయాసపడుచు నా పనిని నాజీవితమును వాడుదునని ప్రమాణము చేయుచున్నాను.

5) శ్రమ, కరువు, ఖడ్గము, నింద, అవమానము మొదలైన వాటికి హత సాక్ష్యము కొరకు నిలబడుదునని ప్రమాణము చేయుచున్నాను.

6) ఏ మతమును గాని, ఏజాతిని గాని, ఏజనమును గాని కనబడి నప్పుడు నేను రాకడ వర్తమానము చెప్పుదునని నేను ప్రమాణము చేయుచున్నాను.

7) అన్యుడు, అవిశ్వాసుల సహవాసమును విడిచి విశ్వాసుల యొక్కయు, దేవుని యొక్కయు సహవాసము చేయుచున్నాను.

8) అందరితో సమాధానముగాయుందునని నేను ప్రమాణము చేయుచున్నాను.

9) దేవుడు కనబడును, మాటలాడుచున్నారని యితరుల యెదుట ప్రమాణము చేయుచున్నాను.

10) ప్రతి విషయములోను నీకును సన్నిధికి సంపూర్ణముగా లోబడుదునని నేను ప్రమాణము చేయుచున్నాను. ఆమెన్. మరనాత.

## రాకడ ప్రార్ధనలు

### 1వ ప్రార్ధన

మా పరలోకపు తండ్రీ! సంఘముయొక్క తండ్రీ! పరలోకమందును దానిలోనున్న సంఘముయొక్క తండ్రివైన తండ్రీ! నీకు వందనములు. నీవు యింతమందికి తండ్రివి, నీ బిడ్డలు పరలోకములో పరిశుద్ధులైయున్నారు. భూలోకములో విశ్వాసులైన బిడ్డలున్నారు. నీ బిడ్డలు లేని స్థలములేదు. పూర్వలోకములో కూడా తయారగుచున్న నీ బిడ్డలున్నారు. నీ బిడ్డలులేని స్థలములేదు మోక్షము యొక్క పరిశుద్ధులు కాక యిప్పుదును పరలోకమునకు సిద్ధపడుచున్న పరిశుద్ధులుగాక ఊర్ధ్వలోకమందును సిద్ధపడుచున్నవారును

నీ బిడ్డలే, కాబట్టి నీకు వందనములు. అయితే ఇంతమందికి తండ్రివై యున్నావనే సంగతి తెలియదు. తెలిసిన వారికి ఈ సిద్ధి కలదు.

ఓ తండ్రీ! నీవు తండ్రివని ఎవరైతే తెలిసికొని విశ్వసించి ప్రేమించు చున్నారో వారు మరొక విషయము తెలిసికొనుచున్నారు. మేమును ఆ తండ్రి బిడ్డలమైయున్నాము. దేవదూతలెంతో మోక్షము లోకమువారెంతో భూమిమీద తయారగుచున్న మేమును అంతే. అయితే అవిశ్వాసులైనవారి నిమిత్తము కనిపెట్టుచున్నాము. ముఖ్యముగా వధువు సంఘమెప్పుడు తయారగునో, ఆ మహిమ మతాభీవలె సూర్యకాంతివలె నేను తెలిసికొన్న కాంతివలె కాదు. మేమెవ్వరము యెప్పుడు చూడలేనిమహిమ పరలోకములోనున్న ఆఖరు సంఘముతో కలసికొన్నప్పుడు, అప్పుడు నీ మహిమ నీశక్తి తెలిసికొందుము. ఆయన మహిమ అంటే యిది ఆయన శక్తి అంటే యిది భూలోకములో నుండగా తెలిసికొన్నదికాదు అని ఇక్కడ సంతోషింపలేని సంతోషములో సంతోషింతుము. ఇక్కడ మా గ్రహింపులేని సంతోషము కొంచెమే, మేము ఆ మహిమను గ్రహించుటకై ఈ లోకపు మహిమ మరచిపోయే కృప దయచేయుము.

తండ్రివైన ప్రభువా! రక్షకుడవైన ప్రభువా! ఆదరణకర్తవైన ప్రభువా ముగ్గురు తండ్రులు కాక ఒక్కతండ్రివైయున్న తండ్రి నీకనేక స్తోత్రములు. మేము నీ బిడ్డలమని మహాధైర్యముతో యిప్పుడు సంపూర్ణమైన శైలితో అనలేము దయగలతండ్రీ మమ్ములను దుఃఖములోనికి నిరాశలోనికి దింపే ఒక్కమాట బైలుపర్చినావు ఇదివరకే మహా ప్రేమగలమాట, మాకర్థముకాని మాట తెలియపర్చినావు అది యేమిటంటే “భూలోకములోనున్న ప్రతిమనిషిలో మిక్కిలి స్పష్టముగా మాట్లాడవలెనని నాకు ఉన్నది” అన్నావు ప్రభువా! ఏమి గ్రహింపగలము భక్తులతోనే పూర్తిగా మాట్లాడుటలేదు మిక్కిలి తరచుగాను మాట్లాడుటలేదు. ఇది ఎట్లు గ్రహింపగలము అలాగు మాట్లాడకపోవుటకు మేము ఆటంకము ఈ మహా గొప్ప ప్రేమ, దాగియున్న ప్రేమ నీ నామము



ధరించిన సంఘమంతటికి అలాగే లోకములోనున్న అవిశ్వాసులందరికి ఎప్పుడు ఈ సంగతి బైలుపడును? మేము ప్రభువా! ప్రకటన చివరి భాగములో అప్పుడు అందరితో ఒక్కసారే మాట్లాడుదువు అందరికి వినబడును గాని అందరూ మార్పుపొందరుగదా! ఇప్పుడుమాత్రము వినబడితే మార్పు పొందుదురా? నా చెవి ఓరుపెడుతున్నదనుకొంటారు, గాని ప్రభువు చెప్పినాడనుకొనరు. తండ్రి చెప్పినాడని వారనుకొనరు, కాని బెదిరి బెదిరిస్తారు, కొందరు భక్తులు యేదో దేవత మాట్లాడుతుంది. బయటకు వెళ్ళవద్దు తలుపువేసుకొనండి అంటారు. మనిషి యింత కఠినము చేసికొన్నాడు, అయినను ప్రభువా! నీవు తండ్రివి గనుక ప్రేమించడము మాత్రం మానలేదు. కాబట్టి నీకనేక వందనములు.

మా ప్రభువా! ముఖ్యముగా 30 సంవత్సరములనుండి ఈ సంగతి వింటున్నవారిలో ఎవరైన ఒకరు అనుదినము మిక్కిలి తరచుగా నీ స్వరము వినేటట్లు సిద్ధము కాగలిగిన మాకెంతో సంతోషము అట్టి సమయము ఎప్పుడు వచ్చును? అట్టి వ్యక్తి యెప్పుడు వచ్చును? మా ప్రభువా! ఇప్పుడనేకమంది కొద్దిగా నీ స్వరము వింటున్నారు. సంతోషము, గాని ఎవరూ పూర్తిగా వినలేకపోవుచున్నారు. విచారము తరచుగా మేము ఈ ప్రకారము కూడుకొన్న క్రమేణ ఈ స్థితిలోనికి రాగలము (దేవుని స్వరము వినేస్థితి)

షరా: లోకాధికారులు పాఠశాలకైనా సెలవిస్తారు గాని నీ స్వరం వినడానికి మా శరీరము, మా స్వజనులు, మాపని మా బలహీనత సెలవియ్యదు.

ఓ తండ్రీ! మేము నీతో మాట్లాడే విషయములు చాలా ఉన్నవి గాని తరుణములేదు. 24 గంటల సమయమున్నను మేమందుకొనే తరుణము లేదు సమయములేదు. క్షమించమని త్వరగారానైయున్న యేసు ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము ఆమెన్.

## 2వ ప్రార్థన

ఓ దయగల తండ్రీ! సమస్తము నీయందు గుప్తములై యున్నవి నిన్ను

గురించి తెలిసికొంటే అన్నిటిని తెలిసికొనగలరు. అందుచేత దైవభక్తులు నిన్ను ప్రత్యక్షత అన్నారు. తండ్రిని, కుమారుని పరిశుద్ధాత్మను గురించిన సంగతి పూర్తిగా తెలిసికొనవలెను. సమస్తమును నీయందు గుప్తములై యున్నవి. మేము నీకు నమస్కారముచేస్తే మిగిలినవన్నిటికి చేసినట్లే నన్ను చూస్తే "తండ్రిని చూసినట్లే"యని చెప్పినావు. అన్నీ నీయందు గుప్తములై యున్నవి. ఒక గంటసేపు ధ్యానములోనున్నయెడల పొందవలసిన స్థితి పొందగలము. ధ్యానము మా ప్రార్థన, మా వాక్యము ఉద్రేకముగా నుండగలవు. అట్టిదిలేకుండాయుంటే సమస్తము వ్యర్థము. కొన్ని చప్పగాను కొన్ని మహా ఉద్రేకముగానున్నవని కూటములను గురించి చెప్పుదురు. కూటములో ప్రతిదినము నూతన విషయమును తెలిసికొనవలెను. నా దిన కూటములు యేవైనాసరే ఈదినము సమాజము యేరీతిగా నున్నదని ప్రశ్నించుకొనవలెను అప్పుడు పరలోక కూటస్తులు ఉద్రేకముగా నుందురు నిన్ను తలంచుకొనుట, నీచిత్తమంతయు తలంచుకొనుటే సమస్తము నీయందు గుప్తములైయున్నవి. గనుక ప్రభువా! నీకువందనములు ప్రభువైన యేసు పరిశుద్ధాత్మ తండ్రీ; ఇవన్నీ తీసికొని బోధపర్చుచున్నావు గనుక ప్రభువా మీకనేక వందనములు, అంతియొకైయ సంఘస్తులు కూటములుగా కూడినారు నామకార్థముగా కాక ఉత్సాహముగా భక్తితో విశ్వాసముతో, సంతోషముతో చేసికొన్నారు అన్యుల పట్టణములో, భక్తులనులేపినావు, నీకు వందనములు నీవువారికి ప్రత్యక్షమై ఒక మాట అన్నావు ఆమాట క్రొత్తనిబంధనలోనున్న అపొస్తలుల కార్యములు మొదలు పౌలు వ్రాసిన పత్రికలయొక్క చివరిమాటవరకు కూడవెళ్ళి ప్రత్యక్షుడవైనావు నీకు వందనములు. ఒక గొప్ప మాట అన్నావు ఓ సంఘమా ఆత్మ మీతో యేమిచెప్పునో వినవలెను మేము ఏ కూటము జరిపిన తండ్రి, కుమార, పరిశుద్ధాత్ముడవైన తండ్రీ నీ పునరుత్థానము నేటివరకు తలంచుకొని యున్నయెడల మాకుటుంబము బలపడగలదు మాకు తెలియకుండనే ప్రక్కబడిపోవును. మేడ గట్టిదైతే వరద ప్రక్కబడిపోవును.



ఒక ప్రక్కను ప్రభువు రాకడ ఇంకొక ప్రక్క యిప్పుడెక్కడ, యిప్పుడెక్కడ ఈరెంటిమధ్య మేమున్నాము గాని యిప్పుడెక్కడ అనే సందేహముండరాదు. ఓ తండ్రీ మేము రెండు ప్రవాహములమధ్య నున్నాము ఒక ప్రవాహము కుడివైపు మరియొక ప్రవాహము యెడమవైపు నున్నది. నీళ్ళు ఆనకట్టమీద ప్రవహించినపుడు, ఇంటిమీద ప్రవహించినపుడు ఒక ధ్వని వినబడుచున్నది గాని మంచినీటి ప్రవాహధ్వని వినబడదు. దీవెన అందరికి దయచేయుము. మాకూటస్థులు ఇదివరకే నేర్చుకొనవలెను. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల పనులు క్రొత్తవిగా నేర్చుకొనవలెను. ప్రభువా! నీ రాకడ తండ్రి రాకడ నేర్చుకొనవలెను. అది గ్రహింపగలిగే కృపమాకు దయచేయుము. ఈ కథ తలకెక్కదు, చివరి దినములలో అనేకమంది ప్రేమ చల్లారిపోవును అది మాయందు నెరవేరకుండే కృప దయచేయుమని కాపాడుమని అడుగు చున్నాము. విశ్వాసమందుందువా? యని తలంచుకొంటే బల్లెపుపోటు ఎన్ని పర్యాయములు యెన్ని మీటింగులు పెట్టుకొన్న అన్ని పర్యాయములు ప్రభువైన యేసు త్వరగా రమ్ము అనే ప్రార్థన చేయగలిగే గొప్ప కృప కలిగించుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

షరా : ఈ ప్రార్థనవిని పౌరుషము, ఉద్రేకము గలవారై యెన్ని ప్రార్థనలు చేసికొనిన ముగింపులో నీరాకడ త్వరగా అని అనవలెను

త్రియేక దేవుడవైన తండ్రీ! మాకు క్రైస్తవజీవిత అనుభవము ప్రారంభమైనది మొదలు ఎన్ని వందనములు చెల్లించవలెనో అన్ని వందనములు చెల్లించు చున్నాము. త్వరగారానైయున్న యేసుప్రభువు ద్వారా అంగీకరించుము. ఆమేన్!

## 3వ ప్రార్థన

త్రియేక తండ్రీ! ఓ తండ్రీ ఓదేవా! ఓప్రభువా! సర్వాధికారీ! సమస్త సృష్టికి కర్తవైన ప్రభువా! నీమహాగొప్ప మహిమ యెదుట పాపులమైన మేము ఈ దినమందు కూర్చుండి నీయొక్క రెండవ రాకడ ధ్యానము చేయనై యున్నాము, గనుక ముందుగా స్తుతించుచున్నాము. ఈ సమావేశము

నిమిత్తము స్తుతించుచున్నాము. ఓదేవా! నీవు కలుగజేసిన సూర్యచంద్ర, నక్షత్రముల కాంతి వధువుసంఘము చూచినప్పుడు ఇవి ఇంతకాంతిగా యుంటే నీవు ఎంత కాంతిగాయుందువోయనే తలంపుతో ఆనందించే కృపదయచేయుము, మేము ఎప్పుడు పరలోకమునకు వెళ్ళి ఆయన కాంతిలో, ఆమహిమకాంతిలో, జ్యోతుల కాంతికిమించిన కాంతిలోనుందుమో అని ఆశించే కృప వధువు సంఘమునకు దయచేయము పై మహిమ తలంపు, ఆకాశమండల మహిమ మాకన్నులయెదుట చూపిస్తున్నావు నీకు మా వందనములు మేము జన్మించినది మొదలు జీవాంతమువరకు ఆకాశ మహిమకాంతిచూపించుచు, నీకాంతిని జ్ఞాపకము చేస్తున్నావు గనుక నీకు వందనములు. నరుడు నీ సంగతులు తెలుసుకొనవలెనంటే బోధలకన్న గ్రంధములకన్న ముందుగా జ్యోతులవలె తెలియపర్చుచున్నవి గనుక నీకు వందనములు. మానిమిత్తమై జ్యోతుల దగ్గరనుండి కాంతిలోకి వచ్చుచున్న మేఘములలో దాహశాంతి నిమిత్తమై, మా స్నానము నిమిత్తమై దాచిపెట్టిన జలమును చూడగా మేము పరలోకమునకు వచ్చి సమరయ సుకార నూతివద్ద నీవు చెప్పిన జీవజలము యెప్పుడు పానము చేయుదుమో అనే తలంపుతో, నిన్ను స్తుతించు కృప వధువు సంఘమునకు దయచేయుము, మాకంటె తక్కువగా నిన్ను గురించి తెలిసియున్న వృక్షాదులయొక్క ఉదయకాల గానము విని మేము యెప్పుడు పరలోకము వెళ్ళి స్తుతిగానము, ఆగని స్తుతిగానము, భూలోకమెరుగని స్తుతిగానము, నూతన గానము, భక్తులగానము నందుకొనుము అనే ఆతురతో కనిపెట్టగల నిత్యాశ వధువు ఆశించునట్లు నీకృపదయచేయుము. ఇట్టి జ్ఞానశక్తి నిమిత్తము నీకు వందనములు, ఇంకను యెగువకు రాగా పాపముతో నిండియున్న ఈ భూమిమీద మొలిచిన చెట్లకు యెంతో రమ్యమైన పువ్వులు, పండ్లున్నవి పాపము లేనప్పుడు ఏదేనుతోటలోని పండ్లు పూలు ఎట్లుండునోయని మేము పరలోకములోనికి వచ్చునప్పుడు చూచే ఆశ వధువునకు దయచేయుము అట్లుచేయుటకు యివి ముంగుర్తులైయున్నవి.



ఎంత పాపము వ్యాపించినను సృష్టి యింత రమ్యతగలిగి రమ్యముగాయుంటే మాతండ్రీ! పరలోకములో మా వస్త్రధారణ, దేవదూతలు, మేమక్కడ యెంతో రమ్యముగా నుందుమో యని మరెక్కువగా తలంచే కృప మాకు దయచేయుము. ఇట్టి తలంపు నిమిత్తమే నీకు వందనములు. పాపముతో నిండిన ఈ లోకములో కొందరు విశ్వాసులను, బోధకులను ఏర్పర్చి నీవాక్యము వివరిస్తున్న వింటూయున్న వధువు సంఘమునకు ఒక మంచి తలంపు కలిగించుము. ఇక్కడ బోధకులే యింతగా వినిపిస్తే పాపము లేని ఆ పరలోకములో ఎంత వినసొంపుగా వుండునో అనే తలంపు వధువు సంఘమునకు దయచేయము. అట్టి జ్ఞాపకమును కలుగజేసే తండ్రికి నిత్యమంగళ స్తోత్రములు, పరలోకములో మాస్వజనులు మాకు బోధించినవారు, మాబోధవిని మారిన వారు మా పాతనిబంధన లోనివారు, మా క్రొత్త నిబంధనలోని వారు మా సంఘ చరిత్రలోనివారు మా మిషనువారు మేము యెన్నడును అనుకొనని పరమ దుర్మార్గులు, పరమ భక్తులు మున్నగువారిని మేము కలసికొనే ఆతురత కొరకు నీ కృప దయచేయుము.

ఈ రమణీయ ఆలోచన నిమిత్తమే వందనములు కొంతవరకు యిక్కడ దర్శనములో చూస్తున్నాము. మాకు తృప్తిలేదు. ముఖాముఖిగా చూచు భాగ్యము దయచేయుము. అప్పుడు మాకు పాడు లోకము పాడుతలంపులు పాడు మాటలు, పాడు క్రియలు, పాప సమూహము, మాకు జ్ఞాపకమునకు రాదు. అట్టిస్థితి అక్కడయున్నది. గనుక త్వరలో వెళ్ళిపోవలెను. త్వరగా వస్తానన్న ప్రభువు వస్తుంటే మేముకూడా త్వరగా వస్తున్నాము అని అనుకొనే కృప దయచేయుము. చివరలో పాపుల మధ్య సుంకరుల మధ్య కూర్చుండి భుజించియున్న మా ప్రభువువలె పాపులమధ్య, సుంకరుల మధ్యనున్న వధువు సంఘము యొక్క ఈ సంతోషము, ఈ నిరీక్షణ, ఈ సమావేశాలు, ఈ బోధలు ఈ జ్ఞానము మా చుట్టునున్న వారు చూస్తుండగా మాకెక్కువ ప్రేరేపణ సంఘములోనికి వచ్చేటట్లు చేయగల ప్రభువా! అట్టి ఘనకార్యము చేస్తుండగా

యెన్నాళ్ళకో నీవు కూడా వధువు సంఘములోనికి వచ్చావా? ప్రభువా అని హస్తపరిచయము చేసికొనేటట్టు కృపాతరుణము దయచేయుమని వేడుకొను చున్నాము. ఈ నూతన సంకల్పన నిమిత్తము నీకు వందనములు నీ సన్నిధిలో నున్నాము, అవసరమైనవి అందించుమని వేడుకొనుచున్నాము.

షరా : 365 దినములు కూడా రాకడను గురించి ధ్యానింపవలెనన్న 370 సార్లు క్రొత్తనిబంధనలో ఉన్నవి రాకడ కాంతి మీలో వెలిగింపబడును. చదివిన కొలది నూతనమైన కాంతి కనబడగలదు.

యేసుప్రభువు 3 మందలింపులు 2 సలహాలు చెప్పెను.

(లూకా 21:34-36)లో తిండి, మత్తు ఐహిక విచారమును 3 మందస్థితిలు ఉన్నవి. 1.తిండిమీద పడిపోయి పరలోకమునకు సిద్ధపడడము విషయములో అశ్రద్ధగా నుందురు విశ్వాసులకు యీ మాట చెప్పుచున్నారు. ఈవిషయములో ఎవరైనా నేరస్థులై యుందురో జాగ్రత్తగా చూచుకొనుడి. పరీక్షించుకొనుడి. పెండ్లికుమార్తె జ్ఞాపకము చేసికొని భోజనము చేయునప్పుడు ఈ మందలింపు మాట జ్ఞాపకముంచుకొనండి. ఒక ముద్ద తక్కువగా తినమని డాక్టర్లు చెప్పెదరు. ఎక్కువగా తింటే ఎక్కువ బలమను కొంటారు, గాని రెండు ముద్దలు తగ్గించిన మంచిది.

2. మత్తు : అలికిడివల్ల, త్రాగడంవల్ల, ఏవిధమైన మత్తయినా సరే సిద్ధపడుటకు ఆటంకమే. మత్తును రద్దుచేయుము. ఇప్పుడిప్పుడే కాదు అనుకొని నిద్రపోయిన వారు భక్తి ఎక్కువైపోయి నిద్రపోయినారు. ఇప్పుడప్పుడే కాదు. అనేది చేదస్తము, 30-35 ఏండ్లనుండి చెప్పుచున్నారు, అప్పుడే కాదు అంటే విశ్వాసులు ఊరుకొంటారు. మత్తురావడమునకు అనేక కారణములుండును గనుక అది రాకుండ చూచుకొనండి.

3. ఐహిక విచారము : ఈ లోక సంబంధమైన చింతకుటుంబములో ఆరంభమగును. భార్యభర్తలు కీచులాడుట పరలోక విచారము, చింత, పెనిమిటి యింకా మారుమనస్సు రాలేదనే చింత, పైనుండి వచ్చే జలము



భూమిమీద బురదలో కలసి చెడినట్టు చిక్కుకాదు బలే చిక్కు పల్లెగాదు, బలే పల్లె, పిల్లలు చెప్పేమాట వినరు. ఆ చింత మనకు ఉండరాదు. కళంకము కలుగనియ్యరాదు. చింతపెట్టుకొంటే వెళ్ళలేరు. ప్రభువు యుక్తకాలమందు వారిని మార్చును. చింతించితే మూరెడు పొడగగుదురా? నేను బోధించినాను, ప్రార్థిస్తాను అని అనుకొనవలెను కుటుంబములో మాత్రము కాదు సంఘములో ఉండును. మారుమనస్సు పొందని వారిని గురించే రోధన, ప్రార్ధన, ఉత్తరము వ్రాయుట మానవద్దు, శ్రద్ధతో వినేవారు స్థిరులు ముప్పదంతలు వ్రాసికొనేవారు అంతకంటే స్థిరులు, అరువదంతలు ఇతరులకు చెప్పేవారు నూరంతలు, వినడమే చెయ్యడము. 1) విశ్వాసము, 2) విశ్వాసముతో కూడిన క్రియ, 3) క్రియతో కూడిన విశ్వాసము. ఆ దైవము కొరకు కనిపెట్టక పోయినందువల్లనే ఆ కన్యకలు వెళ్ళలేకపోయిరి.

యేసుప్రభువు ఆ గడియ, ఆదినము తెలియదని యిప్పుడే రాదని యెంత చెప్పినను పెండ్లికుమార్తె ఆ గడియ ఏదో, ఆదినము ఏదో ఆ సంవత్సరము ఏదోయని ముఖ్యముగా కనిపెట్టవలెను.

సైమల్ టేనియస్: ఏకకాలము, ఆ ఏకకాలము ఏకకాలము? రెప్పపాటు కాలము, పైమూడు అనగా తిండి, మత్తు, ఐహికవిచారము. ఈమూడు కూడనివి ఏరగా ఏరగా ప్రభువు యీమూడు ఏరినాడు. ఇవి పాపములు కావు గాని అజాగ్రత్తకు సంబంధించినవి. జాగ్రత్త నిమిత్తము ప్రభువు ముందుగా చెప్పెను పాపము చేయుటలో జాగ్రత్తగానుందురు. ఈవిషయ ములో మందముగా నుందురు.

సలహాలు: 1) ఎల్లప్పుడు ప్రార్ధన చేయుట. 2) మెళకువగా నుండుట, మెళకువ అనగా నిద్రలేకుండ నుండుటకాదు. నిద్రపోతున్నను సరే రాకడ తలంపులో ఉషారుగా నుండుట. డాక్టరు మార్టిన్ లూథర్‌గారు "నా ఆత్మను నీచేతికి అప్పగించుచున్నానని" ప్రతిరాత్రి చివర ప్రార్ధనచేసి నిద్రపోయేవారు. నిద్రపోయినా మెళకువగా నున్నట్లే పెండ్లికుమార్తె చేసే ప్రార్ధన యేమైనా

నున్నదా? ప్రభువైన యేసూరమ్మ్మ అనే ప్రార్ధన ఈప్రార్ధన యెందుకు? ఇది అన్నింటికి ముఖ్యమైనది ఆదామవ్వలను సైతాను మోసము చేసెను. అప్పుడు సాతాను బంధించెనా? ఒకనాడు పాపము చేస్తే చిరకాలము వైరము యెందుకు? అది బంధము, సైతానుకు విమోచనలేదు. అది బంధమే, మట్టి తింటావు నేలకు ప్రాకుతావు నిత్యము బంధకము శిక్షయేగాన రక్షణలేదు. ఇది ప్రభువు మాకు బైలుపర్చిన వ్యాఖ్యానము. మనకు శిక్షయున్న రక్షణయున్నది సాతాను చిత్తుచేయబడిన శత్రువు. ఆదాముదగ్గరే ఓడిపోయి నాడు. దేనికిని మనము భయపడనక్కరలేదు చింతపడనక్కరలేదు. ఆరు నరుని సంఖ్య ఏడు దేవుని సంఖ్య సైతానుకు పూర్తిగా బంధనకాదు, ఆదామవ్వను పైన, సైతాను క్రింద జడ్జికోర్టులో బంధనలోయున్నాడు. గాని అతనిలో విషమున్నది. పొడపామున్నది. అది ఊదినది, వెళ్ళిపోయినది గాని దాని గాలి, దాని విషముయున్నది. విషముయొక్క వేరున్నది ఆ విషము కయీనులోనికి వచ్చి సైతాను చెప్పిన మాట అబద్ధమని చెప్పెను హేబేలు చనిపోయెను. ఆవిషయము అక్కడనుండి జలప్రళయకాలమునకు వచ్చి ఓడను ఎక్కనివ్వలేదు అక్కడనుండి మన కాలములో 7 ఏండ్లు వెయ్యిఏండ్లు వరకు వచ్చెను దేవుడు చెరలోనున్న సాతానుకు యెందుకు విడుదల యిచ్చెను? మధ్యలో మనుష్యులున్నందున విడుదల యిచ్చెను. వీరు పిలచిన పిలుపున్నది "నీవు ఊదిన విషమున్నందున కోరుదురు. కోరేవారు లేకపోయిన సాతానును ఆపైపైనే నరకములోనికి పంపివేయును. మనిషి కోరుకొన్నాడు. దానిలోని విషము వారిలో నున్నందున వారు కోరుకొన్నారు ఒక తెల్లని కాగితముమీద ఈ సాతానుమీద ఆర్జీవ్రాసికొని పెండ్లి కుమార్తెతో సంతకము చేయించిన అప్పుడు పెండ్లికుమార్తె సింహాసనము దగ్గరనున్న విజ్ఞాపనకర్తకు అందించిన తండ్రి శాంక్షన్ (Sanction) చేయును వెంటనే సాతాను పనికి ముగింపు అగును. అది జరుగదని మాకు తెలుసు, జరిగిన బాగుండును విశ్వాసులు అర్జి యిచ్చుకొంటున్నారు, గాన సాతానును బంధించుము



ఓప్రభువా! విశ్వాసులెవ్వరు సాతాను చేతిలో పడకుండ చేయుము ఈమా ప్రార్ధనలు వాక్యము లన్నియు త్వరగా రానైయున్న యేసుప్రభువు ద్వారా అంగీకరించుము తండ్రీ ఆమేన్.

## 4వ ప్రార్ధన

తండ్రీ! నీకుమారుని ద్వారా యిచ్చిన సమస్త వాక్యము నిమిత్తమై వందనములు. నీవు ఒకప్పుడు మేము, మా పూర్వికులు పుట్టకముందు నరులకు యివ్వడము ఆరంభించి నేటివరకు నీ గుప్పిలి విప్పియేయుంచినావు. ఇంకా యిచ్చుచున్నావు ఇది నీ కృప, వెయ్యి యేండ్లలో ఇవ్వనైయున్నావు. ఇది నీ దాన కృప మాలో కొందరు యిబ్బంది పడుచున్నారు. కొందరు వస్త్రములకు, సొమ్ములకు యిబ్బందిబడుచున్నారు. నీ కుమారుడు రెండవసారి రానైయున్నాడు నీతి సూర్యుడుదయించే ఉదయమైయుండునని మాకు తెలుయును. ఆ ఉదయమే వచ్చినయెడల యిక రాత్రిచూడనేచూడము. చీకటిలేని ఆదేశమునకు తీసుకొని వెళ్ళెదవు ఉదయమైన తరువాత యెప్పుడును పగలే. అట్టి దేశమునకు వెళ్ళనైయుంటే యింకను చీకటి పనులు, చీకటి కార్యములు యెందుకు? ఇది మా కృపాసమయము. ఎవ్వరి యింటి వద్ద చీకటి కార్యములున్నవో మానివేయు కృప దయచేయుము. పాపాంధకారమునకును, మాకును యెట్టి పరిచయము లేకుండా నీ కృప మాకు అనుగ్రహించుము. మా క్రియను, మా మాటలు వినేవారున్నారు మా హృదయములోని చెడును చూచేవారు లేరు. నీవు ఒక్కడవేయున్నావు. నేను సజీవుల గుంపులో నున్న నీ రాకడ గుంపులోని వారి హృదయములోపల ఏ ఒక్క చెడుగున్నదో దానికి గడగడ వణికే కృప దయచేముము. డాక్టర్లు టి.బి అనే వ్యాధిగల వారితో ఏ జబ్బులేదు అనవచ్చును గాని మా హృదయ ములో యేలాంటి తలంపు లేదనుకొనువారి హృదయములో, తొంగిచూచిన నీవేల సజీవులు గుంపులోనికి వెళ్ళగలవు? యేలాగు పెండ్లికుమార్తె సంఘములోనికి వెళ్ళగలవని మనస్సాక్షి ద్వారా నీవు అడిగిన యెడల మేము

సిద్ధపడగలము మాలో యే తప్పులేదని మరణించుటకంటే మాలో ఈ తప్పున్నదని అరచుట మంచిది.

ఈ పాఠములను నేర్చుకొనిన తరువాత కూడా మాలో కళంకములుంటే యేమి లాభము? ఏ మూలనైనను కళంకమనునది లేకుండ రూపుమాపుము మాకు తెలియనిది తెలియపరచుమని బ్రతిమిలాడుకొనుచున్నాము. ఈవేళ యుండవచ్చును. చనిపోయినప్పటికి యింత భక్తి యింత శ్రద్ధయుండునా? నీరాకడ కనుక యెవరిమట్టుకు వారే తలంచుకొని సిగ్గుపడి తండ్రీయని ఒప్పుకొనెను.

మహా పవిత్రముగా యుండేటట్లు ఆశీర్వదించుమని, వేడుకొనుచున్నాము. మాలో ఏమైన తప్పున్నదోయనే బాష మాకు అక్కరలేదు. ఉన్నదనే బాషదయచేయుము. దయగల ప్రభువా! నీవు కృప గలవాడవని అనేకమంది లోకువగట్టుచున్నారు. నీవు క్షమించువాడవని చాటున పాపములు చేయుచున్నారు తల్లి యెక్కువ గారాబముగా చూచినయెడల పిల్లలు మాటవినరు నీ కృపను, నిన్ను నీ వాక్యమును బోధించేవారిని లోకువ గట్టినారు మేమట్టివారము గాకుండచేయుము శోధనలు రాకుండ మానవు. జయించే దైవశక్తి అనుగ్రహింపుము.

విశ్వాసులనోట సజీవులగుంపు, రెండవరాకడ, పెండ్లికుమార్తె సంఘ వరస మేఘనివాసము, పరలోకపు విందును ఈ మాటలే విన్న ఆశయున్నది గాని క్రియలేదు. మేమట్టివారమైయుండక జాగ్రత్తగా యుండే కృప దయచేయుము వందనములు. ఎంతో ప్రేమతోచెప్పిన మారలేదు అన్నీ విడిచి పెట్టి ఒక్కటి విడిచిపెట్టకపోయిన లాభము లేదు. పెండ్లికుమార్తె సజీవుల గుంపు రెండవ రాకడయని అనవసరముగా ఆగడము యెందుకు? ఈ మూడు వ్యర్థముగా యుచ్చరించువారును దోషులగుదురు. కళంకమును అనుకొను వారు దోషులై యుందురని మాకు నేర్పుము. నీ కృప మాకు యిక్కడ అందేటట్లు ఆశీర్వదింపుమని వేడుకొనుచున్నాము. ఆమెన్. మరనాత.



## రెండవ రాకడ

రా: యదుకుల రాంభోజి తా॥ ఆది

ఛాయ (ఎవరు భాగ్యవంతులౌదు)

యేసు ప్రభువు వచ్చుచున్నాడిదిగో వినరండి – పూర్వదోసకారులు
చంపిరి బ్రతికెను – దొడ్డవరుడై వచ్చునండి ॥యేసు॥

1. యూదులు పాలెస్తీన వెళ్ళు – చున్నారనుమాట – నిజము
ఈ దినాలలోనే క్రీస్తు – యేసు వచ్చుట ॥యేసు॥

2. కారులు బస్సులు సంచరించు – కాలమిదేగదా – గనుక – ఆ రక్ష
కుని రాకడ సిద్ధమౌ – సమయంబు నిదేగదా ॥యేసు॥

3. పనిపాటులకు కరువైనట్టి దినము వచ్చినది – క్రీస్తు – తన
విశ్వాసులను కొనిపోవు – తరుణము వచ్చినది ॥యేసు॥

4. లోకమంతయును కలత – లోబడిపోయినది క్రీస్తు – రాకడ
గడియ యిపుడన్నట్టు – రానైయున్నది ॥యేసు॥

5. నమ్మువారికి చావేయుండదు – నవరూపము గలగు – వినక
యిమ్మహి మిగిలినవారికి గొప్ప – హింసలు చెలరేగు ॥యేసు॥

6. వినుట విశ్వసించుట ఆజ్ఞకు – విధేయులై మనుట – ఈ పనులు
మూడు చేయువారె – పరలోక వాస్తవ్యులగుట ॥యేసు॥

7. ఈ వేళ ప్రభువు వచ్చునని – యెవరనుకొందురో వారు దేవ
పుత్రుని రాకడయిచ్చు – దీవెనలొందుదురు ॥యేసు॥

8. మరనాత యనగా మన ప్రభువు మరల వచ్చుట – దీనిన్
తరచుగా సలామునవాడు – నరులు ధన్యులు ॥యేసు॥